

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 9 నవంబరు 2024



సోమశిలకు 6,143 క్యూసెక్కుల వరద



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 6,143 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 68.700 టీఎంసీ ల నిల్వ ఉన్నట్లు అధికా రులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,150, కండ లేరుకు తెలుగుగంగ ద్వారా 10,000, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

అక్కడ అలా..



ఇది కర్నూలులో ఉల్లి దుస్థితి ఇది. అక్కడ గిట్టుబాటు ధర లేక.. నిల్వ చేసుకునే సౌలభ్యం లేక ఆరుగాలం కష్టపడి పండించిన ఉల్లిగడ్డలను ఇదిగో ఇలా నేలపాలు చేశారు.

ఇక్కడ ఇలా..



ఉల్లి.. లొల్లి!

- ధర లేక కర్నూలులో కుళ్లిపోతున్న గడ్డలు
- నెల్లూరులో మాత్రం ఎగబాకుతున్న ధర
- ప్రభుత్వం యంత్రాంగం చొరవ అత్యవసరం
- నేరుగా రైతుల వద్ద కొని ప్రజలకు విక్రయిస్తే ఇరువురికీ మేలు

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : వంటలో కీలకమైన ఉల్లిపాయల ధర రోజు రోజుకు పెరిగిపోతోంది. మార్కెట్‌లో ఉల్లి పరిమాణాన్ని బట్టి వ్యాపారులు ధరను నిర్ణయిస్తున్నారు. చిన్నవి రూ.32 నుంచి 35 పలుకుతుండగా, మోస్తరు సైజులో ఉన్నవి రూ.40 నుంచి45, పెద్ద గడ్డలు రూ.60 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఈ ధరలు మార్కెట్‌లో రోజుకు రోజుకు మారిపోతున్నాయి. జిల్లా అవసరాలకు దాదాపుగా కర్నూలు, నంద్యాల ప్రాంతాల నుంచి అధికంగా దిగుమతులు చేసుకుంటున్నారు. ఆ తరువాత మహారాష్ట్ర నుంచి వస్తున్నాయి. కర్నూలు సమీప ప్రాంతాల్లో ఉల్లి దిగుబడులు అధికంగా రావడంతో అక్కడి మార్కెట్‌లో ధరలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. గిట్టుబాటు ధర లభించకపోవడంతోపాటు సకాలంలో కొనుగోలు జరగక ఉల్లిపాయలు కుళ్లిపోతున్నాయి. కొంతమంది రైతులు నేలపాలు చేస్తున్నారు. అయితే, జిల్లాలో మాత్రం ధరలు దిగిరావడం లేదు. ఉల్లి డిమాండ్ ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు, అధికారులు రైతుల వద్ద కొనుగోలు చేసి సబ్సిడీ ధరకు ప్రజలకు అందించేవారు. అయితే కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధరలు పతనమవుతున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అక్కడి రైతులతో సంప్రదించి కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందజేయవచ్చు. అంతేగాక వ్యాపారుల దోపిడీని అడ్డుకోవడంతోపాటు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించినవారు అవుతారు. ఆ దిశగా జిల్లా ఉన్నత యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరి నెల్లూరులో ఇందుకు విరుద్ధం. డిమాండ్‌కు తగ్గట్టు ఉల్లిపాయలు లేవంటూ వ్యాపారులు ధరలు పెంచేశారు. నాణ్యమైన గడ్డలు కావాలంటే కిలోకు రూ.60 వరకు పెట్టాలి, మరీ పచ్చివి అయితే 40 రూపాయలు పలుకుతు న్నాయి.

కారుచౌకగా భూములు లాక్కుంటే ఊరుకోం!

కందుకూరు తహసీల్దారు ఎదుట రైతుల నిరసన

167-బీ జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ భూములను కారుచౌకగా తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఇందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించమని కందుకూరు మండలంలోని మహదేవపురం, ఓగూరు, పలుకూరు గ్రామాల రైతులు స్పష్టం చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులను కలుస్తామని, వారి నుంచి స్పందన లేకుంటే పోరాటానికి సిద్ధపడతామని స్పష్టం చేశారు. కందుకూరు మండలం ఓగూరులో శుక్రవారం జరిగిన అభిప్రాయ సేకరణలో తహసీల్దారు ఇక్బాల్‌ను అన్నదాతలు నిలదీశారు. ఎకరా రూ.2 కోట్లు ఉన్న భూమికి రూ.20 లక్షలు ఇవ్వడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ ధర చెల్లిస్తేనే తమ భూములు ఇస్తామనీ, లేకుంటే ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదని స్పష్టంచేశారు.

6



కందుకూరు తహసీల్దారు ఇక్బాల్‌ను నిలదీస్తున్న రైతులు

కోటి దండాలు

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

వైభవంగా లక్ష దీపోత్సవం

కోటి సోమవారం పర్వదినాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసంలో శ్రవణ నక్షత్రం వచ్చిన రోజును కోటి సోమవారంగా శివకేశవాలయాల్లో జరుపుతారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ప్రాతః కాలం నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు జరగ్గా, వైష్ణవాలయాల్లో విశేష పూజలు జరిపారు. కాగా, నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో కార్తీక లక్ష దీపోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతుల నేతృత్వంలో భారీ సెట్టింగులతో ఏర్పాట్లు చేశారు. విశాఖపట్నం సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానందభారతీ స్వామి అఖండ జ్యోతి వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు కార్తీక మాసం, దీపం విశిష్టతపై ప్రవచించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు.

6



అఖండ దీపం వద్ద పూజలు చేస్తున్న రామానందభారతీ స్వామి, వేమిరెడ్డి దంపతులు

పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోండి

- కార్పొరేషన్‌లో మంత్రి నారాయణ సమీక్ష

నెల్లూరు(సిటీ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో పన్నులు చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. నగర అభివృద్ధిలో ప్రధాన మైన పన్ను వసూళ్లపై శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. ఇప్పటి వరకు ఎంత పన్ను వసూలు చేశారు?, ఇంకా ఎంత వసూలు చేయాలని ఆరా తీశారు. మొండి బకాయిదారులకు ఇటీవల విద్యుత్ సరఫరా కట్ చేయడంపైనా వివరాలు తీసుకున్న మంత్రి, సదరు బకాయిదారులకు రెడ్ నోటీసులతోపాటు కఠినతరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో పచ్చదనం, పరిశుభ్రత, డివైడర్ల ఆధునికీకరణ, సెంట్రల్ లైటింగ్ అంశాలపైనా నారాయణ సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ సూర్యతేజ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా సైకోలపై ఉక్కుపాదం

అభ్యంతరకర పోస్టులపై పోలీసుల నిఘా ● పలువురికి 41 నోటీసులు



ఉదయగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పెద్దలు, మహిళా మంత్రులు, వారి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న వైసీపీ మూకలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టేవారిపై పోలీసు శాఖ కొరడా ఝుళిపించడానికి సిద్ధమైంది. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని 41 నోటీసులు జారీ చేయడంతోపాటు విచారిస్తున్నారు. ఏ ఐడీతో పోస్టు పెట్టినా సైబర్ నిపుణుల బృందాల సహాయంతో పట్టుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. సోషల్ మీడియా గ్రూపులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.

● సైబర్ నేరంగా పరిగణించి..

గతంలో ఐపీసీ చట్టాల్లో శిక్షలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం నూతనంగా అమల్లోకి వచ్చిన భారత న్యాయ సంహిత చట్టాల ప్రకారం శిక్షల కాలం పెరిగింది. సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలతో పోస్టులు పెట్టేవారిపై భారత న్యాయసంహితలోని 352, 353(2), 353 (1) (సీ) చట్టాలతోపాటు సైబర్ నేరంగా గుర్తించి పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఆయా చట్టాల కింద నేరాలు రుజువైతే రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడనుంది.

● వైసీపీ మూకల ఆగడాలు

వైసీపీ నాయకులు కొందరు కార్యకర్తలను రెచ్చగొట్టి కూటమి నేతలపై సోషల్ మీడియాల్లో పోస్టులు పెట్టిస్తున్నారు. వాటిని వైరల్ చేయిస్తున్నారు. తమ చేతికి మట్టి అంటకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. చివరికి కార్యకర్తలు బలవుతున్నారు. అధికారంలో ఉండగా కొందరి నేతలు, కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసుకొని పిచ్చి పోస్టులతో అందరినీ వేధింపులకు గురి చేశారు. ఇటీవల వింజమూరు పట్టణానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ పెసల శివారెడ్డి సోషల్ మీడియాలో ప్రభుత్వం, మంత్రులపై అసభ్యకర పోస్టులు పెట్టారు. దీనిపై టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన్ను అదుపులోకి తీసుకొని 41 నోటీసులు జారీ చేసి విచారిస్తున్నారు.

● వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు వైఎస్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. ఆ సమయంలో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఓ వ్యక్తి సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఇష్టారాజ్యంగా పోస్టులు పెట్టాడు. అలాగే సీతారామపురం మండలంలో ఓ వ్యక్తి మంత్రులు, ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంతో పోలీసులు స్టేషన్‌కు పిలిపించి నోటీసులు జారీ చేశారు.

● ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోపాటు వారి కుటుంబ సభ్యులను, న్యాయమూర్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, విద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్

- మిగతా 6లో



ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

రబీ సాగు 7.77 లక్షల ఎకరాల్లో..

సాగునీటి సలహా మండలి సమావేశంలో తీర్మానం

- నీటి విడుదల కొనసాగించాలని నిర్ణయం
- రెండేళ్ల తర్వాత పూర్తి ఆయకట్టుకు సాగునీరు

నెల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల తర్వాత జిల్లాలో పూర్తి ఆయకట్టు సాగు చేసేందుకు అవకాశం కలిగింది. ఈ ఏడాది సోమశిల, కండలేరు జలాశయాల కింద 7.77 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సాగునీటి సలహా మండలి (ఐఏబీ) తీర్మానించింది. ఇందులో సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలు ఉండగా, కండలేరు కింద 2.26 లక్షల ఎకరాలు సాగుకానుంది. ఐఏబీ చైర్మన్, కలెక్టర్ ఓ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఐఏబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతోపాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కావ్య కృష్ణారెడ్డి, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఇరిగేషన్ అధికారులు రెండు ప్రాజెక్టుల్లోని నీటి లభ్యత, ఆయకట్టు వివరాలు, సాగునీటి ప్రతిపాదనలను మండలి ముందుంచారు. దీనిపై చర్చించిన సభ్యులు రబీ సాగుకు సంబంధించి నీటి కేటాయింపులపై కీలక తీర్మానం చేశారు. పలువురు ఎమ్మెల్యేలు వారి పరిధిలోని రైతుల సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఇప్పటికే రెండు జలాశయాల నుంచి నీటి విడుదల జరుగుతోంది. ఈ విడుదలను సాగు పూర్తయ్యే వరకూ కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు.

నీటి కేటాయింపులు..

కాలువ	ఆయకట్టు	టీఎంసీలు
పెన్నార్ డెల్టా	2.47 లక్షలు	24.7
కనుపూరు కాలువ	66 వేలు	6.60
కావలి కాలువ	1.24	12.4
ఉత్తర కాలువ	72 వేలు	7.20
దక్షిణ కాలువ	42 వేలు	4.20
కండలేరు	2.26లక్షలు	22.60
మొత్తం	7.71	77.10

● సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలు

సోమశిల ప్రాజెక్టులో ప్రస్తుతం 69.34 టీఎంసీలు నీరు ఉంది. రానున్న రెండు నెలల్లో మరో 11 టీఎంసీలు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేశారు. మొత్తంగా 80.48 టీఎంసీలు అందుబాటులో ఉంటుందని భావించి ఆ మేరకు కేటాయింపులు జరిపారు. డెడ్ స్టోరేజీ 7.70 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 3 టీఎంసీలు, నీటి ఆవిరి 1.50 టీఎంసీలు పోను సోమశిలలో 68.46 టీఎంసీల నీరు మిగులుతుంది. అలానే కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లలో 3.17 టీఎంసీలు ఉంది. మొత్తంగా ఈ ఏడాది సాగుకు 71.63 టీఎంసీలు అందుబాటులో ఉంటుందని అధికారులు లెక్కలు వేశారు. దీని ద్వారా 5.51లక్షల ఎకరాలకు 55.10 టీఎంసీలు కేటాయించాలని ఐఏబీలో తీర్మానించారు. అందులో పెన్నార్ డెల్టాలో 2.47 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేలు, కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలు, ఉత్తర కాలువ కింద 72 వేలు, దక్షిణ కాలువ కింద 42 వేల ఎకరాలకు నీటి కేటాయింపులు జరిపారు. 10 వేల ఎకరాలకు ఒక టీఎంసీ నీటిని వినియోగించేలా నిర్ణయించారు. ఇక రాళ్లపాడుకు మరో 1.50 టీఎంసీలు పోను నికరంగా 15 టీఎంసీలు మిగులుతుందని

- మిగతా 6లో

విద్యుత్ చార్జీల పెంపుపై త్వరలో ఉద్యమం

కోవూరు (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై త్వరలో ఉద్యమం చేప ట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు తెలిపారు. విద్యుత్తు సంస్కరణలను నిరసిస్తూ శుక్రవారం గంగవరంలో సీపీఎం జాతా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నా యకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, పెద్దబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలను ప్రోత్సహించండి

- సిడ్బి సమావేశంలో కలెక్టర్ ఆనంద్



నెల్లూరు (వెంకటేశ్వరపురం, సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విభజిత నెల్లూరు జిల్లాలో మూడు పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని, వాటిలోని చిన్న పారిశ్రా మికవేత్తలు ఉత్పత్తిని పెంచేందుకు, ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్ మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బి) పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధికి కూడా కృషి చేయాలన్నారు. నెల్లూరులోని ఓ హోటల్లో శుక్రవారం సిడ్బి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఆధారిత జీడీపీ పెరిగే అవకాశం ఉందని, పారిశ్రామిక వ్యవసాయ రంగాలకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. బత్తాయి, మామిడి తదితర పంటలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారని తెలిపారు. వాటిని స్థానిక మార్కెట్‌లో కాకుండా విదేశాలకు ఎగుమతి చేసే విధంగా చూడాలన్నారు. సిడ్బి హైదరాబాద్ రీజియన్ మేనేజర్ వేమూరి చంద్రమౌళి జిల్లాలో తమ బ్యాంకు లక్ష్యాలను వివరిం చారు. చిన్న తరహా పరిశ్రమలకు అందిస్తున్న రుణాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ సూచనల ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్ఎం వెంకట సురేష్, డీఐసీ ఏడీ శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కాలువ ఇట్లా.. నీరు కదిలేది ఎట్లా?

నెల్లూరు నగరంలోని రామిరెడ్డి కాలువలో మురికి నీరు ముందుకు కదలడం లేదు. సీఏఎం స్కూల్ నుంచి ఉమామహేశ్వరాలయం వెళ్లే మార్గంలో కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. దీనివల్ల దోమలు, దుర్గంధం వ్యాప్తి చెందుతున్నాయి. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కమిషనర్ జోక్యం చేసుకుని మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

నెల్లూరు రైల్వేస్టేషన్ పనులకు బ్రేక్

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ విస్తరణ, అభివృద్ధి పనులు కొన్ని రోజులుగా నిలిచిపోయాయి. పునరాభివృద్ధి పథకం కింద రూ.102 కోట్లతో ప్రతిష్ఠాత్మకం గా చేపట్టిన ఈ పనులు ఈ ఏడాది మే నెలకే పూర్తి కావలసి ఉంది. అయితే కాంట్రాక్టర్ నిర్మాణ పనులను నత్తనడకన సాగిస్తూ వచ్చారు. కొంతకాలంగా పూర్తిగా నిలిపివేశారు. అధికారులను అడిగితే వరుస పండుగలు, వర్షాల కారణంగా పనులకు బ్రేక్ వచ్చిందని చెబుతున్నారు. కానీ, బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ పనులకు బ్రేక్ వేశారని విశ్వసనీయ సమాచారం.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం,ఆంధ్రజ్యోతి)







వైభవంగా లక్ష దీపోత్సవం

- వీఆర్సీ మైదానంలో ఆధ్యాత్మిక శోభ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో కార్తీక లక్ష దీపోత్సవం శుక్రవారం వైభవంగా మొదలైంది. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతుల నేతృత్వంలో ఈ ఉత్సవం జరుగుతోంది. ఇందుకోసం 20 అడుగుల శివలింగం, అయోధ్య బాల రామాల యం, త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం నమూనాలను భారీ సెట్టింగులతో ఏర్పాటు చేశారు. ఉదయం వేమిరెడ్డి దంపతులు గోపూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అయోధ్య బాల రామునికి పూజలు, త్రయంబకేశ్వరు డికి అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం కేరళ బ్యాండ్ కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. సాయంత్రం విశాఖపట్నం సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతీ స్వామి అఖండ జ్యోతితో కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు మంగళ శాసనాలు చేశారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరికీ సుఖశాంతులను ఇస్తాయని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు కార్తీక మాసం, కార్తీక దీపం విశిష్టతపై ప్రవచనం చేశారు. కోటి సోమవారం నాడు లక్ష దీపోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. తొలిరోజు కార్యక్రమాల్లో చివరిగా భస్మాభిషేకం, హారతు లు జరిగాయి. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ పీ చెంచలబాబు యాదవ్, కేతంరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





భక్తులతో మాట్లాడుతున్న రామానంద భారతీ స్వామి

సంప్రదాయ దుస్తులతో దేవాలయాలను సందర్శించండి

- రామానంద భారతీ స్వామి

తోటపల్లిగూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలకు వచ్చే భక్తులు సంప్రదాయ ఎరుపు, తెలుపు, పసుపు దుస్తులను ధరించి అమ్మ వారిని దర్శించుకోవాలని శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠం విశాఖపట్నం పీఠాధిపతి రామానంద భారతీ స్వామి తెలిపారు. మండలంలోని వరి గొండలో వెలసిన శ్రీజ్వాలాముఖి ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి అమ్మణ్ణిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసులు, కోడూరు శ్రీనివాసులురెడ్డి కుటుంబం ఆయన స్వాగతం పలికి పట్టు వస్త్రాలు అందచేశారు. అనంతరం రామానంద భారతీ స్వామి మాట్లాడుతూ దేవాలయాలకు వచ్చే భక్తులు శుభ్రతను పాటించి, మౌనరీతిలో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. గ్రామదేవతలు శక్తివంతమైన వారని, కోపం వస్తే ఎవరూ తట్టుకోలేరని, సంప్రదాయబద్ధంగా పూజలు చేయాలని కోరారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలకు నిండుగా ఉండాలని, కార్తీక మాసంలో ప్రతిరోజు పూజలు చేయాలని కోరారు. భక్తులకు ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానికులు కర్పూరం శ్రీనివాసరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, జానా రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పెదపవని చోరీ కేసు అనుమానితులు

లింగసముద్రం, నవంబరు 8: పెదపవనిలో జరిగిన భారీ చోరీ కేసులోని అనుమానితులను శుక్రవారం పోలీసుల అదుపులో తీసుకుని విచారణ చేపడుతున్నారు. ఈ నెల 4న అర్ధరాత్రి గ్రామంలో భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు 5వ తేదీ ఉదయం నుంచే విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా బుచ్చికి చెందిన ఓ వ్యక్తి పెదపవనిలో ఉంటున్నాడు. ఈయనపై గతంలో కొన్ని కేసులు నమోదై ఉన్నాయి. పోలీసులు ఇతనిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించడంతో ఈయన ద్వారా మొత్తం సమాచారాన్ని సేకరించిన పోలీసులు నెల్లూరులో మరో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 8 మందిని నెల్లూరులోని ఒక రహస్య ప్రదేశంలో ప్రదేశంలో విచారిస్తు న్నట్టు తెలిసింది. వీరిలో కొందరు పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నట్టు సమాచారం. వీరు నెల్లూరులో పని చేసుకుంటూ స్థానికంగా ఉంటున్న కొందరి తో కలిసి నేరాలు చేస్తున్నట్టు సమాచారం. రెండు రోజుల్లో కేసు పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

కారుచౌకగా భూములు లాక్కుంటే ఊరుకోం!

- ఎకరా రూ.2కోట్ల ఉన్న భూమికి 20 లక్షల పరిహారమా!?
- కందుకూరు తహసీల్దారు ఎదుట రైతుల నిరసన

కందుకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ నుంచి పోరుమామిళ్ల వరకు జరుగుతున్న 167బీ జాతీయ రహదారి పనుల్లో మొదటిదశ సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు పనులు పూర్తి కావొచ్చాయి. భవిష్యత్తులో ఈ రహదారిని 4 లేన్లు విస్తరించేందుకు అనువుగా మరోసారి భూసేకరణకు అధికారులు నోటిఫికేషన్ విడుదలచేశారు. ఈ భూసేకరణ ప్రక్రియ ప్రకాశం జిల్లా కలెక్టరు నేతృత్వంలో జరుగుతోంది. సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు ప్రభుత్వ భూమి, రోడ్డు పోరంబోకు పోను రైతుల నుంచి 22.86 ఎకరాలను సేకరించాల్సి వస్తుందని నిర్ధారించిన అధికారులు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో సింగరాయకొండ నుంచి కందుకూరు వరకు 10.99 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉండగా మిగిలిన 11.85 ఎకరాలు కందుకూరు నుంచి మాలకొండ వరకు సేకరించాల్సి ఉంది. అయితే కందుకూరు - సింగరాయకొండ మధ్య ఉన్న ప్రాంతమంతా హైవేకు ఇరువైపులా భూములు కోట్ల రూపాయలు పలుకుతున్నాయి. ప్రస్తుతం ఎకరా రూ.2 కోట్ల వరకు ఉంది. అయితే భూసేకరణ అధికారులు పలుకూరు రెవెన్యూ పరిధిలో ఎకరానికి 20 లక్షలు, ఓగూరు రెవెన్యూ పరిధిలో ఎకరానికి 26.7 లక్షలు మాత్రమే పరిహారంగా ఇస్తామని చెబుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రకాశం జిల్లా జేసీ ఈ ప్రాంతంలో విచారణ జరిపి రైతులతో మాట్లాడినా పరిస్థితిలో మార్పురాలేదు. దీంతో రైతుల అభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం కందుకూరు తహసీల్దారు ఇక్బాల్ ఓగూరులో గ్రామసభ ఏర్పాటుచేయటంతో రైతులంతా నిరసన తెలిపారు. మార్కెట్ ధర చెల్లిస్తేనే తమ భూములు ఇస్తామనీ, లేకుంటే ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదని స్పష్టంచేశారు. వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాలని కోరారు. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణే లేనప్పుడు హడావిడిగా భూసేకరణ ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. దీంతో గ్రామసభను అర్ధంతరంగా ముగించి తహసీల్దారు వెనుదిరిగి వెళ్లారు.



రక్షణ కవచం.. న్యాయసేవల చట్టం

- నేడు న్యాయసేవా దినోత్సవం

- బాధితులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న వైనం

నెల్లూరు (లీగల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు నీతిసూత్రాలు, నియమాల ఉనికి రక్షణ కవచాలుగా పేర్కొంటూ వాటిని న్యాయసూత్రాలుగా చట్టబద్ధం చేశారు. చట్టాలు మనిషికి కనీస అవసరాలు. స్వతంత్రత, కూడు, గూడు, నివాసం, జీవించే, పనిచేసే హక్కులను గుర్తించాయి. ఇవి కొందరికి దక్కడం లేదని ప్రాథమిక హక్కుగా గుర్తించి రాజ్యాంగబద్ధం చేశారు. వీటి నుంచే న్యాయ సర్వీసుల అధికారిక చట్టం ప్రవేశ పెట్టింది.

న్యాయసేవల అధికారిక చట్టం

1976లో భారత రాజ్యాంగానికి అధికరణ 39 (ఏ) జతచేసి పేద, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా నిర్దేశించారు. ఇందుకోసం ఒక చట్టాన్ని రూపొందించారు. అదే న్యాయసేవల అధికారిక చట్టం. ఇది కేంద్ర చట్టం. ఈ చట్టం నిర్దేశించినట్టు రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ఉమ్మడిగా కొన్ని సూత్రాలను, నిర్దేశకాలను రూపొందించారు. షెడ్యూల్డు కులం లేదా తెగకు చెందిన వారు, మానవ అక్రమ రవాణా బాధితులు, యాచకులు, మహిళలు, పిల్లలు, మతిస్థిమితం లేని వారు, దివ్యాంగులు, సామూహిక విపత్తు, హింసాకాండ, కుల వైషమ్యాలు, అతివృష్టి, అనావృష్టి, పారిశ్రామిక విపత్తులు తదితర అంశాలలో బాధితులు ఉచిత సహాయం పొందేందుకు అర్హులు. అలాగే ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) చట్టం 1956లో సెక్షన్-2 (జీ) లో తెలిపిన నిర్బంధం, సంరక్షణ సహా లేదా బాలనేరస్థుల న్యాయ చట్టం 1986 సెక్షన్ (జె)లో తెలిపిన నిర్బంధం లేక మెంటల్ హెల్త్ చట్టం 1987 సెక్షన్ 2 (జి)లో తెలిపిన మానసిక వైద్యశాల లేక మానసిక చికిత్సాలయంలో తెలిపిన నిర్బంధంలో ఉన్న వారు అర్హులు.

లోక్ అదాలత్‌ల పాత్ర

సహృద్భావ వాతావరణంలో శాంతియుతంగా చర్చించి సమస్యలకు పరిష్కారం పొందడం అనే సిద్ధాంతం నుంచి ఈ లోక్‌అదాలత్ ఉద్భవించింది. పూర్వం కుల పెద్దలు లేదా గ్రామపెద్దలు ప్రజల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించే వారు. దేశంలో మొట్టమొదటి సారిగా 1872లో బెంగాల్ రెగ్యులేషన్ చట్టంలో ఈ పంచాయితీలకు గుర్తింపు ఇచ్చారు. అందుకే రాజీయే రాజమార్గం అని పెద్దలు అంటారు. ఎంతటి వివాదమైన సుహృద్భావ వాతావరణంలో అందరూ కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం తప్పక లభిస్తుందని పెద్దల నానుడి.

ప్రతి మూడు నెలలకోసారి

దేశవ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నారు. ఈ లోక్‌అదాలత్‌లలో రాజీకి యోగ్యమైన కుటుంబ తగాదాలు, సివిల్, ఆస్తి, రోడ్డు ప్రమాదాలు, క్రిమినల్ కేసులు, లేబర్ కోర్టు కేసులు పరిష్కరింపబడుతున్నాయి. ప్రతి జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా లోక్ అదాలత్ భవనాలను ప్రారంభించి ప్రతిరోజూ రాజీకి యోగ్యమైన కేసులను ఇక్కడ పరిష్కరిస్తున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రాలలో సీనియర్ సివిల్ జడ్జి హోదా కలిగిన అధికారిని లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శిగా నియమించారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయ సహాయం పొందేందుకు రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నెల్లూరుతోపాటు కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కోట, నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట వంటి కేంద్రాలలోను లీగల్ సర్వీసెస్ వారు లోక్ అదాలత్ కేసులను త్వరిత గతిన పరిష్కరిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ప్రజలందరికీ తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం తన బాధ్యతగా గుర్తించి ఇటువంటి చట్టాలు చేస్తోందన్నమాట. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వాణి లోక్‌అదాలత్‌ల ద్వారా జిల్లావ్యాప్తంగా ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. కేసుల పరిష్కారంలో ఇప్పటివరకు ఐదుసార్లు జిల్లా మొదటిస్థానం సాధించింది.

న్యాయవాదుల సహకారం మరువలేనిది



జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్ర స్థాయిలో నెల్లూరు జిల్లా ప్రథమ స్థానాన్ని ఐదుసార్లు సాధించింది. ఈ ఘనత జిల్లావ్యాప్తంగా ఉన్న న్యాయా ధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బందికి, అన్ని కంపెనీల బ్యాంకు సిబ్బందికి దక్కుతుంది. ఎటువంటి వివాదాలైనా రాజీ మార్గం ద్వారా సుహృద్భావ వాతావరణంలో కేసులు పరిష్కరించుకోవచ్చు.


- సి.యామిని, జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్

మొదటి లోక్ అదాలత్

మొట్టమొదటి లోక్ అదాలత్ 1982, మార్చి 14వ తేదీన గుజరాత్‌లోని జనాఘడ్‌లో జరి గింది. ఆ తర్వాత 1984లో మహారాష్ట్రలో లోక్ న్యాయా లయాన్ని ప్రారంభించారు. మన రాష్ట్రంలో 1985, డిసెంబరు 15న విశాఖలో మొట్టమొదటిసారిగా లోక్‌అదాలత్ నిర్వహించారు. వీటి ప్రాచుర్యాన్ని గుర్తించిన ప్రభుత్వం న్యాయసేవ ప్రాధికార సంస్థల చట్టం 1987ను రూపొందించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబరు 9వ తేదీన న్యాయసేవ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

నేడు అవగాహన సదస్సు

నూతన క్రిమినల్ చట్టాలపై ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐలా) ఆధ్వర్యంలో శనివారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ భవన్‌లో న్యాయవాదులకు అవగాహన సదస్సు జగనుంది. నూతన చట్టాలపై పలువురు న్యాయవాదులు ప్రసంగించనున్నారు. ఈ కార్య క్రమంలో న్యాయవాదులు పాల్గొనాలని ఐలా ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కో-ఆర్డినేటర్ కాకి శాంతి కుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



సత్వర న్యాయం పొందొచ్చు

లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయ సహాయం అందుతుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో బాధితులకు సత్వర న్యాయ సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాము. నెల్లూరులో ప్రతిరోజు కోర్టు పని దినాలలలో రాజీకి యోగ్యమైన అన్ని కేసులు పరిష్కరిస్తున్నాము. కక్షిదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అలాగే నిరుపేదలు విధి వంచితులు, ప్రమాదాలలో గాయపడిన వారికి, దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న వారికి ఉచితన్యాయ సహాయం అందిస్తున్నాము.

- కే.వాణి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి

7.77 లక్షల ఎకరాలకు సాగునీరు

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఈ నీరు రెండో పంటకు వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడింది.

కండలేరు కింద..

కండలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 49.38 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. రానున్న రెండు నెలల్లో మరో 10.6 టీఎంసీలు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేశారు. మొత్తంగా 60 టీఎంసీలు ప్రాజెక్టులో ఉంటుందని, అందులో 8.40 టీఎంసీలు డెడ్ స్టోరేజీ పోను నికరంగా 51.56 టీఎంసీలు మిగులుతుందని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఇందులో చెన్నై తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు, నెల్లూరు, తిరుపతి జిల్లాల తాగునీటి అవసరాలకు 2 టీఎంసీలు, నీటి ఆవిరి 6 టీఎంసీలు, స్వర్ణముఖి బ్యారేజీ నీటి అవసరాలకు 2 టీఎంసీలు, పరిశ్రమలకు 1.25 టీఎంసీలను, లోయర్ రైపేరియన్ కింద 2.150 టీఎంసీలను కేటాయించారు. అలానే 22.60 టీఎంసీలను నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 22.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఐఏబీలో తీర్మానించారు. ఈ కేటాయింపులు అన్నీ పోగా మరో 10 టీఎంసీలు కండలేరులో మిగులుతోంది. ఈ నీటిని 2025 సంవత్సరంలో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని నిర్ణయించారు.

కాలువలన్నీ బాగు చేస్తాం : మంత్రి

జిల్లాలో ఉన్న సాగునీటి కాలువలను బాగు చేయించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఐఏబీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఒక్క కాలువలో కూడా పూడిక తీయలేదని, బిల్లులు మాత్రం చేసుకున్నారని ఆరోపించారు. వీటిపై విచారణ చేయిస్తామని ప్రకటించారు. కాలువల అభి వృద్ధిలో రైతులు, రైతు నాయకులు సహకరించాలని కోరారు. రాష్ట్ర ఖజానా ఇప్పు డిప్పుడే గాడిన పడుతోందని, సీఎంతో చర్చించి మరిన్ని నిధులు తీసుకొస్తామని చెప్పారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నీటి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటే ఒక టీఎంసీతో 16 వేల ఎకరాలు పండించ వచ్చునని అన్నారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. రైతుల ఆస్తి అయిన పంట కాలువలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ అధికారులే కాకుండా రెవెన్యూ, వ్యవసాయ శాఖలు కూడా కాలువలు ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, ఇరిగేషన్ ఎస్ఈలు దేశానాయక్, వెంకటరమణారెడ్డి, అధికారులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా సైకోలపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

మీడియాలో పోస్టులు పెట్టిన గుంటూరుకు చెందిన వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను టీడీపీ నాయకుల ఫిర్యాదుతో పోలీసులు అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నారు.

చట్టపరంగా చర్యలు తప్పవు



వ్యక్తిగత గౌరవాన్ని కించపరిచేలా, విధ్వంసాలను రెచ్చగొట్టేలా, ఉన్నత పదువుల్లో ఉండేవారి పట్ల అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తప్పవు. ఇప్పటికే ఉదయగిరి సర్కిల్ పరిధిలో 4 కేసులు నమోదు చేశాం. సోషల్ మీడియా గ్రూపులపై ప్రత్యేక నిఘా ఉంచాం.

- ఎన్.వెంకటరావు, సీఐ, ఉదయగిరి



వృథాగా చెత్తబుట్టలు

పంచాయతీల్లో వ్యర్థాల సేకరణకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తెప్పించిన చెత్త బుట్టలు ఎంపీడీవో కార్యాలయంలో వృథాగా పడివున్నాయి. ఎన్నికల ముందు వీటిని ప్రతీ ఇంటికి పంపిణీ చేయాలని తెప్పించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పంపిణీచేయలేదు. ఎన్నికలు ముగిసి 4నెలలు అయినప్పటికీ బుట్టల గురించి ఎవ్వరూ పట్టించుకోలేదని, లక్షలు వెచ్చించి తెచ్చిన బుట్టలు ఎందుకూ పనికి రాకుండా పోయో ప్రమాదం ఉందని, వెంటనే పంపిణీ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)



మధ్యాహ్నానికే మూత!

సర్వేకు సచివాలయం ఉద్యోగులు

ఉద్యోగులంతా సర్వేకెళ్లారు... సచివాలయానికి తాళం వేశారు!. మరి వచ్చిన ప్రజలకు జవాబుదారెవరు?, వారికి సేవలు ఎవరందిస్తారు?. ప్రస్తుతం నెల్లూరులోని సచివాలయాల తీరు ఇలా ఉంది. సామాజిక పింఛన్ల పంపిణీలో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుడి ఇంటికి జియో ట్యాగింగ్ చేస్తోంది. ఈ మేరకు సాంకేతికతతో మ్యాపింగ్ చేసే సర్వే నగరమంతా జరుగుతోంది. ఈ సర్వే పేరిట సచివాలయ ఉద్యోగులంతా బయటకెళ్లిపోతున్నారు. శుక్రవారం పెద్దచెరుకూరు లోని (2/4) సచివాలయానికి మధ్యాహ్నం 3.34 గంటలకే తాళం వేసేశారు. ఉద్యోగులు ఎవరూ లేరు. కార్పొరేషన్ ఉన్నతాధికారులు మితిమీరిన ఒత్తిడి తీసుకురావడంతో తట్టుకో లేక ఉద్యోగులు ఇలా సచివాలయాలకు తాళాలేసి సర్వేకు వెళ్తున్నట్లు సమాచారం.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

స్మార్ట్ మీటర్లకు రుసుము లేదు

● ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వినియోగదారులు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగానే ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఓ ప్రకట నలో పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో కచ్చితమైన రీడింగ్ వస్తుందని, ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 8వేల సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చామని తెలిపారు. ఈ మీటర్ల వల్ల ప్రతినెలాఖరుకు రీడింగ్ నమోదవుతుందని, మొదటివారంలో తీసే అవసరం ఉండదన్నారు. వినియోగదారులంతా వీటిని ఏర్పాటు చేయించుకోవాలని కోరారు.

ఎస్‌జీటీల సర్టిఫికెట్ల పరిశీలన

● నెల్లూరులో 31కి 20 మంది ● కావలి, గూడూరులో 13కి 8 మంది హాజరు

నెల్లూరు(విద్య/ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు శుక్రవారం నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సర్టిఫి కెట్ల పరిశీలన నిర్వహించారు. నెల్లూరు మునిసిపల్ పరిధిలో పీడీకి ఒకరు, హిందీకి ముగ్గురు, తెలుగుకు ముగ్గురు ఉపాధ్యా యు లు సర్టిఫికెట్ల పరిశీలన కు హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఇంగ్లీష్‌కు 9 మంది హాజరు కావాల్సి ఉండగా నలుగురు, సోషల్‌కు 9 మందికిగాను ఐదుగురు, మ్యాథ్స్‌కు ము గ్గురికి ఇద్దరు, బయలాజికల్ సైన్స్‌కు ముగ్గురికి ఇద్దరు హాజరయ్యారని పేర్కొన్నారు. మొ త్తం 31 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాల్సి ఉండగా 20 మంది హాజరైనట్లు తెలిపారు. కావలి, గూడూరులోని మునిసిపల్ పాఠశాలల పరిధిలో ఒక్క పీడీ పదోన్నతికి ఒకరు హాజరు కాగా, సోషల్‌కు ముగ్గురికి ఇద్దరు, బయలాజికల్ సైన్స్‌కు ఆరుగురికి నలు గురు, ఫిజికల్ సైన్స్‌కు ముగ్గురికి ఇద్దరు, సోషల్‌కు ముగ్గురికి ఇద్దరు హాజరయ్యా రన్నారు. మొత్తం మీద 13 మందికిగాను 8 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైనట్లు వివరించారు. హాజరు కాని వారు రెండు రోజుల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయించుకోవాలని సూచించారు.

● మునిసిపల్ ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

మునిసిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని మునిసిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ ఓ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని ఆరోపించారు. సీనియారిటీ జాబితాలు ఇచ్చిన తరువాత ఎన్ని ఖాళీలు ఉన్నాయో చెప్పలేదని ఆరోపించారు. రోస్టర్ పాయింట్లు ఎక్కడి వరకు ఇచ్చారో, ఎక్కడి నుంచి పదోన్నతులు ఇస్తున్నారో చెప్పకుం డా ప్రక్రియను కొనసాగిస్తున్నారన్నారు. 70:30 నిష్పత్తిని అమలు చేయడంలో నిబంధనలు పాటించడం లేదన్నారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల స్వాధీనం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెడ్డుపాడు గ్రామ సమీపంలో ఉన్న పిల్లాపేరు వాగు నుంచి గురువారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెడ్డుపాడు గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులు సమాచారం అందించామన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి, వింజమూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్ రామిరెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. నాసిరకం ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం గోదాముల్లో నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయాధికారులు ఎస్. వెంకటసుబ్బారెడ్డి, ఆంజనేయులనాయక్, రామ్మోహన్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

25 మద్యం సీసాల పట్టివేత

ఉదయగిరిరూరల్, సైదాపురం 8(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించినట్లు సీఐ టీ లక్ష్మణస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఉదయగిరి ఎక్సైజ్ పోలీసులు కలిసి దుత్తలూరు మండలం నందిపాడు, చింతలకుంట గ్రామాల్లో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై దాడులు చేశారన్నారు. 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడంతోపాటు బత్తుల నరసింహులు, దాసు శ్రీనివాసులును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, సైదాపురం మండలం తోచాం గ్రామంలోని ఓ బెల్టు దుకాణంపై శుక్రవారం రాత్రి ఎస్ఐ కాంతికుమార్ సిబ్బందితో దాడి చేశారు. ఒకరిని అదుపులోకి తీసుకుని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 123 మంది గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యా హ్నం జరిగిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలలో 123 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు మొత్తం 1385 మంది విద్యార్థులకుగాను 1262 మంది హాజరయ్యారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బద్వేల్ వాసి మృతి

అనంతసాగరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరం పంచాయతీ యాకర్లపాడు వద్ద 565 నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బద్వేల్ వాసి మృతి చెందాడు. వివ రాల మేరకు... బద్వేల్ సుమిత్రా నగర్‌కు చెందిన పీసీ వెంకటేశ్వర్లు (45) మోటారుబైక్‌పై పెంచలకోన వైపు వస్తుండగా పీకేపాడు నుంచి బద్వేల్‌కు వెళ్తున్న ఇసుక ట్రాక్టరు ఢీ కొంది. దీంతో వెంకటే శ్వర్లు అక్కడిక్కడే మృతిచెందారు. అనంతసాగరం పోలీసులు అక్కడకు చేరుకొని వివరాలు సేకరించి కుంటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర్లు

యువకుడిపై పోక్సో కేసు నమోదు

సంగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓ యువకుడిపై శుక్రవారం పోక్సో కేసు నమోదయింది. వివరాల మేరకు.. సంగం గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో బాలిక తల్లి దండ్రులకు చెప్పడంతో వారు సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారించి యువకుడిపై పోక్సో కేసు నమోదుచేసి యువకుడ్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	119
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7436
వెండి కిలో ధర	రూ. 93,000
వెండి ఒక గ్రాము	రూ.96.00

చోరీ కేసులో నిందితుల అరెస్టు

కావలి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో సరుడు చోరీ చేసిన కేసులోని ఇద్దరు నిందితులు షేక్ సల్మాన్, ఎల్లంటి వేణులను శుక్రవారం పట్టణ వైకుంఠపురం రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు సీఐ గిరిబాబు తెలిపారు. జనవరి 12న వైకుంఠపురం చేవూరివారి తోట ప్రాంతానికి చెందిన గొట్టిపాటి హైమావతి శివారు అటవీ ప్రాంతంలో పశువులు మేపేందుకు వెళ్లింది. ఆమె ఒంటరిగా ఉండటాన్ని గుర్తించిన నిందితులు ఆమె మెడలోని 3సవర్ల తాళిబొట్టు సరుడును లాక్కుని వెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

● కావలిలో విస్తృతంగా అనధికార లేఅవుట్లు
● అధికారుల సర్వేలో 128 ఎకరాల గుర్తింపు
● స్వాధీనం చేసుకోవడం మీనమేషాలు

సర్వే సరే.. స్వాధీనమేదీ!?

కావలిలోని అనధికారిక లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని అధికారులు సర్వే చేశారు. 128 ఎకరాల భూమిని రియల్టర్లు ఆక్రమించారని నిర్ధారించారు. అక్రమ లేఅవుట్లే కాదు... ప్రభుత్వ అనుమతి పొందిన నుడా లేఅవుట్లలోనూ కాలువలు ఆక్రమంచినట్లు ఈ సర్వేలో తేలింది. ఈ స్థలాల విలువ సుమారు రూ.600 కోట్లు. అయితే, ఇంత విలువైన ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.



వెంగాయగారిపాలెం లేఅవుట్‌లో కొంత మేరకు తవ్వి వదిలేసిన కాలువ

కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ నాయకులే లేఅవుట్‌దారుల అవతారమెత్తి విచ్చలవిడిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేశారు. వీటిలో ప్రభుత్వానికి 10శాతం స్థలం వదలాల్సింది పోయి ప్రభుత్వ స్థలాలే భారీగా ఆక్రమించారు. అప్పట్లో అధికార పార్టీ అండదండలతో అధికారులను మేనేజ్ చేసుకోవటంతో ప్రభుత్వ స్థలాలు అన్యాకాంతం అయ్యాయి. అయితే సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్రభుత్వ స్థలాలను సర్వేనంబర్లు వారీగా తెలిపారు. ఎన్నికలు అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, కావలి ఎమ్మెల్యేగా క్రిష్ణారెడ్డి గెలుపొందటంతో ఆయన ఆదేశాల మేరకు అక్రమ లేఅవుట్లపై ప్రత్యేక బృందా లతో సర్వే చేయించారు. ఈ సర్వేలో సుమారు 128 ఎకరాలు వరకు ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని అధికారులు అధికారికంగా ప్రకటించారు.

> **స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం**
>
> అక్రమ లేఅవుట్లలో సర్వేచేసి గుర్తించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాం. ఈ విషయం ఆర్డీవోతో మట్లాడాం. ఎంత వరకు సర్వే జరిగిందో ఎక్కడ ఆగిందో అనే విషయంపై మరలా సిబ్బందితో సర్వే చేయిస్తున్నాం. త్వరలో వాటిని స్వాధీనం చేసుకుంటాం.
>
> - పీ. శ్రావణ్‌కుమార్, కావలి తహసీల్దార్

● రెవెన్యూ అధికారుల్లో మారని తీరు

భూములపై పూర్తి అజమాయిషీ ఉన్న రెవెన్యూ అధికారులు పనితీరులో మార్పు కానరాలేదు. గతంలో సర్వేచేసి వదిలేసిన కాలువలు, గుంటలు అలాగే ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు వాటి మార్కింగ్ కూడా చెదిరిపోయింది. మరలా సర్వే చేసి మార్కింగ్ చేసినా వాటిని ఎవరు స్వాధీనం పరుచుకోవాలనే చర్చ జరుగుతోంది. కాలువలు, గుంటలు జలవనరులశాఖ పరిధిలోకి వస్తాయని వాటిని వారే స్వాధీనం చేసుకోవాలని మిగతాశాఖ అధికారులు చెబుతున్నారు. తమ వద్ద స్వాధీనం చేసుకుని వాటి చుట్టూ ట్రంచ్ వేసేందుకు నిధులు లేవని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ పరిధిలో ఉండటంతో ఆ శాఖ అధికారులు కొంతమేర ట్రంచ్ కొట్టించి తమకు హక్కులేని భూములతో మనకెందుకు అన్నట్లుగా మౌనంగా ఉంటున్నారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని కాలం గడవనిచ్చి అలాగే వదిలేస్తారా అనేది చర్చనీయాంశమైంది.

● సమన్వయలోపం

అక్రమలేఅవుట్లలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధికారుల సర్వే టీం సభ్యులు ప్రభుత్వ స్థలం చుట్టూ మార్కింగ్ వేశారు. మున్సిపల్, జలవనరులశాఖ అధికారులతో వాటిని స్వాధీనం చేసుకునే కార్యక్రమం చేట్టారు. తొలుత కాలువలను నిర్మించేందుకు కొంతమేర తవ్వించారు. అలాగే గుంటల చుట్టూ కొంత మేర ట్రంచ్ కొట్టించారు. ప్రస్తుతం సమన్వయం లేకుండా మున్సిపల్, జలవనరుల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ గుర్తించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవటంలో వెనుకంజ వేస్తున్నారు. అప్పట్లో అక్రమ లేఅవుట్లు వేయటంలో సహకరించిన అధికారులే కొనసాగుతుండటం విశేషం. దీనికితోడు వారికి బదిలీలు ఉండటంతో స్వాధీనం చేసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ● చెముడుగుంటలో ప్రత్యేక పీజీఆర్‌ఎస్


వెంకటాచలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను గత వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించి గిరిజనులకు మొండిచెయ్యి చూపిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. మండలంలోని చెముడుగుంటలోని శ్రీడ్స్ కళ్యాణ మండపంలో శుక్రవారం నియోజక వర్గ పరిధిలోని గిరిజనుల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. మండలాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ పాల్గొని గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అందజేతే లక్ష్యంగా ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు లేని గిరిజనులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు విద్య, సంక్షేమం, మౌలిక సదుపాయల కల్పనకు ప్రణాళికాబద్ధంగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రాష్ట్రంలోనే సర్వేపల్లి నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అమాయక గిరిజనుల భూములను కూడా పెద్దఎత్తున ఆక్రమించేశారని, ఫ్రీహోల్డ్ పేరుతో అనేక అక్రమాలకు పాల్పడ్డారని, వీటన్నిటిపై విచారించి గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు గంగాభవాని, హేనాసుజన్, వ్యవసాయాధికారి సత్యవాణి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్‌శాఖల ఎస్ఈలు అశోక్‌కుమార్, వెంకటరమణ, విజయన్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీవో కల్పన, తహసీల్దారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే సోమిరెడ్డి

వీఎస్‌యూలో 11న జాబ్ మేళా

వెంకటాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఈనెల 11వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వీఎస్‌యూ వీసీ డాక్టర్ ఎస్ విజయ భాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్త సహకారంతో ఈ జాబ్‌మేళా జరగనుందన్నారు. ప్రముఖ పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారన్నారు. ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు చదివిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన యువత జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాల కోసం 7989613024, 9573482179ను సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు

● పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విక్రమ సింహపురి యూనివర్శిటీలో పీహెచ్‌డీలో ప్రవేశాలకు వచ్చే నెల 15వ తేదిలోపు దరఖాస్తులు చేసుకోవాలని యూనివర్శిటీ వీసీ డాక్టర్ ఎస్ విజయభాస్కర్‌రావు అన్నారు. యూజీసీ నెట్ పీహెచ్‌డీ కోటా, ఎక్స్‌ట్రా మ్యూరల్, ఎగ్జిక్యూటివ్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సీట్ల వివరాలు, అర్హత, నిబంధనల కోసం యూనివర్శిటీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ అవకాశం పరిశోధన రంగంలో విద్యార్థులకు కొత్త మార్గాలు అందిస్తాయన్నారు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల విజేత ఈస్ట్‌గోదావరి

కావలి టౌన్, : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో వెస్ట్‌గోదావరి విజేతగా నిలవగా శ్రీకాకుళం జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. కావలిలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా జరిగిన కరస్పాండెంట్ దామిశెట్టి సుదీర్‌నాయుడు సౌజన్యంతో మూడు రోజులపాటు జరిగిన పోటీలు శుక్రవారంతో ముగిసాయి. నెల్లూరు-అనంతపూర్ జిల్లాల జట్ల మధ్య జరిగి లూసింగ్ సెమీఫైనల్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీబీఎస్ చైర్మన్ దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు పాల్గొని విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెండ్ సుదీర్‌నాయుడు, ఆర్ఐవో శ్రీనివాసులు, డీవీఈవో మధుబాబు, ప్రిన్సిపాల్ టీవీ రావు, అబ్జర్వర్ గంగాధర్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీరేష్ పాల్గొన్నారు.



విన్నర్స్ ట్రోఫీ అందుకుంటున్న ఈస్ట్‌గోదావరి జట్టు

ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలి

● ఏడీఏ నర్సోజీరావు

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ) నర్సోజీరావు ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం ఆయన వివిధ ఎరువుల సంస్థల ప్రతినిధులు, వ్యాపారులతో సమావేశం నిర్వ హించారు. జిల్లాకు ప్రతి నెలా 12,900 మెట్రిక్ టన్నుల ఎరువులు దిగుమతి అవుతు న్నాయని, అయితే రబీ సీజన్‌కు సంబంధించి 20వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమ వుతాయని ఆదిశగా దిగుమతులు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించొద్దని, అదనపు ధరలకు అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమా వేశంలో నెల్లూరు ఏడీఏ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ నర్సోజీరావు

మహిళా పోలీసు డీఎస్పీగా రామారావు

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీగా కేసీహెచ్ రామారావు నియమి తులయ్యారు. ఆయన గతంలో బాలాజీనగర్ పోలీసు స్టేషన్ సీఐగా పని చేశారు. జిల్లా లోని పలు స్టేషన్లలో విధులు నిర్వహించిన అనుభవం ఉంది. ప్రస్తుతం వెయి టింగ్‌లో ఉన్న అయనను మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీ ఉత్తర్వులు జారీ చేశారు.

బెల్టు దుకాణాలపై దాడులు

నెల్లూరు (క్రైం), (ఆంధ్ర జ్యోతి) : ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం కలిగిరి మండలంలోని నరసారెడ్డి పాళెంలో బెల్టు దుకాణంపై దాడులు చేశారు. పరుచూరి శ్రీకాంత్ అనే వ్యక్తి వద్ద 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌డీ కాలేషావలీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, నెల్లూరు 1వ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ధర్మారావు, శీమయ్య, రహీం ద్రపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు

● విద్యుత్‌శాఖ ఈఈకి రైతు సంఘం వినతి



విద్యుత్ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలో గత మూడు రోజులుగా నివాస, వాణిజ్య భవనాలకు పాత విద్యుత్ మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో భవిష్యత్‌లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని నెల్లూరు జిల్లా రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పలువురు విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖ ఈఈ ఐ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత విద్యుత్ మీటర్లను వినియోగదారులు డబ్బులు చెల్లించి కొనుగోలు చేశారని, ప్రస్తుతం బిగించే స్మార్ట్ మీటర్లకు భవిష్యత్‌లో విడతల వారీగా డబ్బులు వసూలు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

పశు సంవర్థక శాఖ జేడీ రమేష్



రైతులకు బహుమతులు అందచేస్తున్న జేడీ రమేష్

సంగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందచేస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్థక జాయింట్ డైరెక్టర్ కె రమేష్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిపాడు పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సుజని ఆధ్వర్యంలో మెగా పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం రాయితీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువులకు, గొర్రెలకు, కోళ్లు, పందుల పెంపకాలకు దాణా తయారుచేసే యూనిట్లు నెలకొల్పేందుకు సుమారు రూ. 20 లక్షల నుంచి కోటి రూపాయల వరకు 50 శాతం రాయితీతో రుణం అందచేస్తారని అవసరమైన పాడి రైతులు స్థానిక పశువైద్యాధికారి ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లేగ దూడలకు ఏలికపాముల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం లేగ దూడల అందాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో చైర్మన్ సోమయ్య, డీడీ శ్రీనివాసరావు, డీఎల్‌డీఏ జయచంద్ర, స్థానిక పశు వైద్యాధికారి సుజని, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

ఉదయగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలోని పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జీ.రమేష్, దుర్గాప్రసాద్, టీ. గోపికృష్ణ, సునీత, సూర్య, అశోక్, శోభ, మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

● ఫోన్ ద్వారా రీచార్జి సౌకర్యం



స్మార్ట్ విద్యుత్ మీటరు బిగిస్తున్న సిబ్బంది

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి విడతగా ప్రభుత్వ కార్యాలయాలకు బిగించిన తరువాత వాణిజ్య, పరిశ్రమలు, గృహాలు, వ్యవసాయ విద్యుత్ మీటర్లకు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈప్రక్రియను ఆత్మకూరు డివిజన్‌లో వేగవంతం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న ఐఆర్ మీటర్ల స్థానంలో వాటిని అమర్చుతున్నారు. కాగా, విద్యుత్ వాడిన తరువాత బిల్లు చెల్లింపు పద్ధతి ఇంతవరకు కొనసాగింది. స్మార్ట్ మీటర్ల రాకతో మొదట డబ్బు చెల్లించిన తరువాత విద్యుత్ వినియోగించాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటరుకు రీచార్జ్ చేయించుకుని విద్యుత్‌ను వాడుకోవచ్చు. రీచార్జ్ మొత్తానికి అనుగుణంగా విద్యుత్‌ను వాడుకోవచ్చు. ఆత్మకూరు విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సుమారు 1500 పైబడి విద్యుత్ కనెక్షన్లు ఉండగా, రూ. 8 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. ఇకపై ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే బకాయిల గొడవ ఉండదని అధికారులు చెబుతున్నారు.

బకాయిల వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : ఏడీ

ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 11000కు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మొదటగా ఆత్మకూరు పట్టణంలో గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. గృహాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ విద్యుత్ మీటర్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం జరుగుతుందని, విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని విద్యుత్‌శాఖ ఏడీ సురేష్ తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : ఆవాజ్



ఆత్మకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఆవాజ్ కమిటీ నేతలు

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం ఆత్మకూరు ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌బజార్ నుంచి పాత బస్టాండ్, బీఎస్‌ఆర్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఆవాజ్ మండల కమిటీ కార్యదర్శి పి యస్దాని బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన షాదీ తోఫా, విదేశీ విద్య, సబ్సిడీ రుణాలు తదితర పథకాలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. మసీదులలో విధులు నిర్వహిస్తున్న ఇమామ్, మౌజన్ లకు ఆరు నెలలకు ఒకసారి కాకుండా ప్రతినెలా జీతాలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేస్తూ తీర్మానం చేయాలని కోరారు. లేనిపక్షంలో ముస్లింలను సంఘటితం చేసి హక్కులను కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆవాజ్ మండల కమిటీ నాయకులు పి మస్తాన్, ఎస్‌డి ఖలీల్, షేక్ ఖలీల్, షేక్ షరీఫ్, పలువురు ఇమామ్, మౌజన్, మతపెద్దలు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: ముస్లిం మైనారిటీల సంక్షేమానికి జరగనున్న శాసనసభ సమావేశాల్లో నిధులు కేటాయింపులు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆవాజ్ కమిటీ జిల్లా సభ్యుడు షేక్ నాయబ్ రసూల్ కోరారు. ఈమేరకు శుక్రవారం మండల ఆవాజ్ కమిటీతో కలిసి తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు నజీర్‌బాషా, బాషా, గఫూర్ సాహెబ్, బాలకృష్ణ, సీపీఎం నేత ఫరుద్దీన్‌బాషా పాల్గొన్నారు.

● అనంతసాగరం: ఎన్నికల సమయంలో ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆవాజ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు టీడీ సునీతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, ఇష్తియార్ పాల్గొన్నారు.

రామాలయంలో కుంభాభిషేకం



రామాలయ కమిటీ నిర్వాహకులతో ఎమ్మెల్యే దగుమాటి

కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనతాపేట సీతారామచంద్ర ఆలయంలో శుక్రవారం మహా కుంబాభిషేకంను ఆలయ కమిటీ సభ్యులు వేదపండితులతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయమర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం



శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సంగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక మాసం కోటిసోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా సంగం శివాలయంలో ఉప్పు (లవణం)ని రంగులతో కలిపి భారీ శివ లింగాకృతి ఏర్పాటుచేసి దీపాలు వెలిగించారు. అనంతరం సంగమేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

మండలాభివృద్ధికి సహకరించాలి

సీతారామపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాలలో తాగునీరు, గ్రామీణ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాలలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణారెడ్డి, ఎంపీడీవో భాస్కర్, ఈవోపీఆర్డీ భార్గవి, గుండుపల్లి సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ అల్లూరురాజు, విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి, హౌసింగ్ ఏఈ పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసి మూడేళ్లు, డీడీ కట్టి ఏడాది కావస్తున్నా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయలేదని, గ్రామాల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో విషపురుగుల సంచారంతో అల్లాడుతున్నామని పలువురు ప్రజాప్రతినిధులు వాపోయారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం సభలో ఆయా శాఖల అధికారులు వారి వారి ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 8: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిబిడి డీఎస్పీ కోటారెడ్డి సూచించారు. శుక్రవారం పొంగూరు హైస్కూల్ ఆవరణలో మానవ హక్కుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబిడి సీఐ బాలకృష్ణ, ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసులు, ఇన్చార్జి తహసీల్దారు అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

సోంపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు

సీతారామపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెమళ్లదిన్నె గ్రామ పంచాయతీలోని సోంపల్లి గ్రామంలో టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి నేలటూరి జాషువ, బూత్ కమిటీ కన్వీనర్ జమ్మలమడుగు ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ సభ్యత్వాలు నమోదు చేశారు. వారి వెంట గడం సుధాకర్,గొల్లపల్లి సహదేవ్, నేలటూరి రాజా,రాజారత్నం, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

పొలం వివాదంలో ఘర్షణ

● ముగ్గురికి తీవ్ర గాయాలు ● ఒకరి పరిస్థితి విషమం

చేజర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలపనాయుడుపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం పొలం వివాదంలో ఘర్షణ జరగడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దారిబత్తిన శివశంకర్, అతని అక్క కుమారుడి కుటుంబ సభ్యుల మధ్య గత కొంతకాలంగా పొలం వివాదం కోర్టులో కేసు నడుస్తోంది. ఈనేపథ్యంలో గురువారం శివశంకర్ అక్క కుమారుడు జితేంద్ర అతని కుటుంబ సభ్యులు వివాదంలో ఉన్న పొలం దున్నేందుకు ప్రయత్నించగా శివశంకర్‌తో పాటు భార్య శారద, కుమారుడు గణేష్ అడ్డుకుని చేజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసమయంలో ఎస్ఐ సెలవులో ఉండడంతో సిబ్బంది పిలిపించి మాట్లాడతామని తెలిపారు. ఈ తరుణంలో శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో మాపైనే కేసులు పెడతారా అంటూ ఓబుల్‌రెడ్డి, జితేంద్ర, ఈశ్వరయ్య, కిషోర్ అనే వ్యక్తులు గడ్డపారలు, కర్రలతో విచక్షణారహితంగా తమపై దాడిచేశారని శివశంకర్, కుటుంబ సభ్యులు వాపోయారు. ప్రసుత్తం ఆత్మకూరు వైద్యశాలలో తాము చికిత్స పొందుతున్నట్లు, తన భర్త పరిస్థితి విషమంగా ఉందని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినప్పుడే చర్యలు తీసుకుని ఉంటే తమపై దాడి జరిగేది కాదని, ఇకనైనా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని శివశంకర్ భార్య డిమాండ్ చేసింది. ఈ సంఘటనపై గ్రామంలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

పట్టాదారుల పేర్లు తొలగింపుపై సీపీఎం నిరసన

ఉదయగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన భూములకు సంబంధించి పట్టాదారు పేర్లను తొలగించడంపై సీపీఎం రైతుసంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య శుక్రవారం రైతులతో కలిసి బిజ్జంపల్లి రైతుసేవా కేంద్రంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన భూరీసర్వే గ్రామసభలో నిరసన తెలియచేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు సంబంధించి పట్టాదారు పేర్లు ఎలా తొలగిస్తారని తహసీల్దారు సుభద్ర ఎదుట వాపోయారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ గ్రామసభలో నేలపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో తహసీల్దారు స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్కు రమణమ్మ, ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో అంజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ స్పాట్‌లుగా మారుస్తున్నాం



తులసి మొక్కకుండీని ఏర్పాటు చేస్తున్న కమిషనర్

కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెత్తరహిత పట్టణంగా మార్చేందుకు శ్రీకారం చుడుతున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌నగర్‌లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేసి తులసి కుండీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో బ్లాక్ స్పాట్‌లను తొలగించి గ్రీన్ స్పాట్‌లుగా మారుస్తున్నట్లు తెలిపారు. తొలుత ఒకటవ డివిజన్‌ను ప్రయోగాత్మకంగా తీసుకుని ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

శాంతినగర్ శ్మశాన వాటిక పరిశీలన

అనంతరం శాంతినగర్ బాలక్రిష్ణారెడ్డి శ్మశాన వాటికను శుక్రవారం కమిషనర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఇందులో వర్షపునీరు నిల్వ ఉండి ఇబ్బందికరంగా ఉందని పట్టణ ప్రజలు చెప్పటంతో వెంటనే అక్కడ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఎంపీడీవో భవన మరమ్మతులకు చర్యలు



అధికారులతో చర్చిస్తున్న ఈఈ వేణుగోపాల్


ఉదయగిరి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాత ఎంపీడీవో కార్యాలయ భవనానికి మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పీఆర్ ఈఈ వేణుగోపాల్, డీఈ మణికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో అప్పాజీ, పీఆర్ ఏఈ శ్రీనివాసరాజులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనాన్ని 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే దుత్తలూరు మండలంలోని బొటికర్లపాడు, రెడ్డదిన్నె గ్రామాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రవీంద్రనాథ్, సీనియర్ అసిస్టెంట్ నవాజ్, డీఈవో ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాకుండా సేవలు అందించాలి

కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా ప్రజల నుంచి ఫిర్యాదుల రాకుండా మెరుగైన సేవలు అందించాలని కావలి ఆర్డీవో వంశీక్రిష్ణ తెలిపారు. ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మున్సిపల్ ప్రత్యేకాధికారి హోదాలో శుక్రవారం తొలిసారిగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సేవలపై సమీక్షించారు. రెవెన్యూశాఖలో ఇంటిపన్నులు, వాటి వసూళ్లు, పన్నుల విధింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఇంజనీరింగ్ విభాగంలో మంచినీటి సరఫరా, వీధిలైట్లు నిర్వహణపై చర్చించారు. శానిటేషన్‌పై ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. పట్టణ ప్రణాళికా విభాగంపై సమీక్షిస్తూ పట్టణంలో ఎక్కడా ఆక్రమణలకు తావులేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు

పీఎం ఖాన్, జలవనరుల శాఖ ఈఈ



కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కావలి డివిజన్‌లోని 108 చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని కావలి జలవనరులశాఖ ఇన్‌చార్జి ఈఈ పీఎం ఖాన్ తెలిపారు.

? డివిజన్‌లో ఎన్నిచెరువులున్నాయి.

! 9మండల్లాలో 281 చెరువులున్నాయి. వాటిలో 172 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 109 పీఆర్ చెరువులు ఉన్నాయి.

? అన్ని చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయా.

! 108 చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. వీటిలో 11 చెరువులకు మాత్రమే పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు అయ్యాయి.

? మిగిలిన చెరువుల పరిస్థితి ఏమిటి.

! 97 చెరువులకు మరలా ప్రతిపాదనలు పంపుతాం. ఉన్న తాధికారుల నుంచి అనుమతులు వస్తే పనులు చేపడతాం.

న్యూస్ బాక్స్

పనబాక దంపతులకు సన్మానం



పనబాక దంపతులను సన్మానిస్తున్న చెంచలబాబు తదితరులు

ఉదయగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, సీనియర్ టీడీపీ నాయకులు పనబాక కృష్ణయ్యలను శుక్రవారం తిరుమలలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అలాగే టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడుని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ఉడతా సుమన్ యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

కావలి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి యం.శోభ తెలిపారు. శుక్రవారం కావలి న్యాయస్థానంలో జరిగిన జాతీయ న్యాయ సేవా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సమస్యల పరిష్కార దిశగా న్యాయస్థానాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మీ, స్పెషల్ మేజిస్ట్రేట్ పరుశురాం, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, న్యాయవాదులు సాయిప్రసాద్, కలీమ్ రోజ్‌దార్, కెనడి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాభేరి

కావలి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాభేరి నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య తెలిపారు. శుక్ర వారం వెంగళరావునగర్ 22వ వార్డులో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టు పనులను త్వరగా పూర్తి చేసి నిరద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని, కృష్ణపట్నం పోర్టు కంటేనర్ టర్మినల్ పునరుద్ధరించాలన్నారు. ట్రూఅప్ విద్యుత్ చార్జీలు ప్రభుత్వమే భరించాలన్నారు. కార్యక్రమంలో పసుపులేటి తిరుపాల్, కృష్ణమోహన్, కృష్ణయ్య, బాబురావు పాల్గొన్నారు.

ఏరుకొల్లులో గ్రామసభ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరుకొల్లు గ్రామంలో శుక్రవారం తహసీల్దారు వై నాగరాజు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వలేటివారిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కందుకూరు డిప్యూటీ డీఈఓ జానకీరాం తెలిపారు. శుక్రవారం ఆయన పోకూరు హైస్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. అపార్ ఐడీ పాఠశాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్కూల్ అటెండెన్స్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిలబస్ పూర్తి చేసి రివిజన్ క్లాసులు నిర్వహించి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవికుమార్, హెచ్ఎం రవీంద్ర పాల్గొన్నారు.

రేపు మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఏపీఎంఐపి ద్వారా 214 మంది లబ్ధిదారులకు రూ. 2.55 కోట్ల విలువ కలిగిన డ్రిప్, స్ప్రింకర్ల యూనిట్‌లను రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేస్తారని ఆనం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నెల్లూరు సిటీ
రూరల్, కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీనగర్, శెట్టిగుంట రోడ్డు, వెంకటేశ్వరపురం, రైతుబజార్, రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు నగర ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ నగర్, నీలగిరి సంఘం, పోలీస్ ఆఫీస్, స్టోన్‌హౌస్‌పేట, యనమలపాళెం, 3వ మైలు, జాకీర్‌హుస్సేన్ నగర్, గాంధీగిరిజన కాలనీ, వెంకటేశ్వరపురం, పప్పులవీధి, తడికల బజార్, ములుముడి బస్టాండ్, గుప్తాపార్కు, ఈద్గా మిట్ట తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

● తోటపల్లిగూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రతాప్ తెలిపారు. కోడూరు, మహాలక్ష్మీపురం, చెన్నపల్లిపాలెం ప్రాంతాలలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

కులగణన కోసం ధర్నా

కోవూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల గణన చేపట్టాలని కోరుతూ నెల్లూరు నగరంలోని గాంధీ బొమ్మ కూడలిలో బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన చేపట్టనున్న ధర్నాకు వెనుబడిన తరగతులు, దళిత వర్గాల యువకులు తరలి రావాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కడింపాటి అనిల్‌కుమార్, సీహెచ్ వేణు కోరారు. తహసీల్దారు కార్యాలయ కూడలిలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ధర్నాలో బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ జే పూర్ణచంద్రరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

ఇందుకూరుపేట/తోటపల్లిగూడూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట మండలాల్లోని 18 మద్యం దుకాణాలలో ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు చేపట్టాలని ఎక్సైజ్ సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి మద్యం దుకాణం దగ్గర ధరల పట్టిక అమర్చామని, వాటిని అతిక్రమించి అధిక ధరలకు మద్యం విక్రయాలు జరిపినా, గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వృద్ధుడి నేత్రాలు దానం

నెల్లూరు (వైద్యం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మస్తాన్‌రెడ్డి(84) శుక్రవారం మృతిచెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిపుణుడు సునీల్ ఆ నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేయాల్సిన వారు 9959589321, 9347111033 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

టీడీపీ నేతపై దాడి హేయం

కొడవలూరు, నవంబరు 8(ఆంధజ్యోతి): రామన్నపాళెంకు చెందిన టీడీపీ నేత డేగా దయకర్‌రెడ్డిపై ఆదే గ్రామానికి చెందిన వ్య క్తులు దాడి చేయడం హేమమని ఆపార్టీ మాజీ ఎస్సీసెల్ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

20 మద్యం సీసాల స్వాధీనం

మనుబోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న గొలుసు దుకాణాలపై గురువారం అర్ధరాత్రి ఎక్సైజ్, సివిల్ పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కంపేట శ్రీరామ్‌నగర్ కాలనీలో పది, వీరంపల్లిలో పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ. శివరాకేష్, ఎక్సైజ్ ఎస్ఐ ఎస్‌డి మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వంతెన కుంగింది జాగ్రత్త!



నగరంలోని మూలపేట అలంకార్ సెంటరు నుంచి పెద్దబజారుకు వెళ్లే మార్గంలోని గచ్చుకాలువపై వంతెన కుంగింది. ఈ వంతెన మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం బ్రిడ్జి తూర్పు భాగమంతా కుంగడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. అయినా యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అటువైపు వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు.

- నెల్లూరుసిటీ(ఆంధ్రజ్యోతి)

'కామాక్షితాయి'లో కార్తీక శోభ



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం అధిక సంఖ్యలో మహిళలు దీపారాధనల చేయడంతో కార్తీక శోభ సంతరించుకుంది. ఉదయం గంగా కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామిరికి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకిసేవలు నిర్వహించారు.

ఇళ్లు నిర్మించని కాంట్రాక్టర్లపై కేసులు పెట్టండి

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల నిర్మాణాల పేరుతో డబ్బులు తీసుకుని నిర్మాణాలు చేపట్టకుండా సహకరించని కాంట్రాక్టర్లపై కేసులు పెట్టాలని ఎమ్మెల్యే హౌసింగ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. ఏదిఏమైనా పేదలకు అన్యాయం జరగడానికి వీల్లేదన్నారు. ప్రతి అధికారి చట్టబద్ధంగా విధులు న్విహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పార్టీలకతీతంగా ప్రజా సమస్యలు పరిష్కరించాలని సర్పంచులకు సూచించారు. గత ప్రభుత్వంలో పంచాయతీలకు ఒక్క పైసా నిధులు ఇవ్వకపోవడంతో కొందరు సర్పంచులు సొంతనిధులు ఖర్చు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన నిధులు పాత పనుల పేరుతో బిల్లులు చేసుకోకుంటే గ్రామాల్లో తాగునీరు, మురుగు సమస్యలు తీరేవన్నారు. పెనుబల్లి ఎంపీటీసీ నారాయణ పలువురు అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. కనిగిరి రిజర్వాయర్ ప్రమాదకర పరస్థితులు పరిశీలించి కాపాడాలని కోరారు. అనంతరం ఆమె వ్యవసాయ అధికారులతో రైతులకు వరి విత్తనాలు, మట్టి నమూనా పత్రాలను అందజేశారు. వచ్చే ఉగాది రోజున అధికారులు రైతులను ఎంపిక చేసి సన్మానం చే స్తా వు న్నా రు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, నాయకులు హరికృష్ణ, ఎంపీ.శేషయ్య, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఎమ్మెల్యేని సన్మానించిన టీడీపీ నేతలు

విడవలూరు(ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలకమండలి సభ్యురాలిగా పదవీ ప్రమాణం చేసిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని మండల టీడీపీ నాయకులు ఓగునాగేశ్వరరావు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చేవూరు రాంప్రసాద్, కొమారి ప్రభాకర్‌లు శుక్రవారం నెల్లూరులోని ఆమె నివాసంలో కలసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలాల్లో కొలువు తీరిన వెంకటేశ్వర స్వామి ఆలయాలను అభివృద్ధి పరచాలని కోరారు.

'స్కిల్' సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఎంపీడీవోకి ఏఎన్ఎంల వినతి



ఎంపీడీవోకి వినతిపత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

ఇందుకూరుపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'స్కిల్' సర్వే నుంచి ఏఎన్ఎంలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కె.నాగేంద్రబాబుకు సచివాలయాల ఏఎన్ఎంలు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన జాబ్ చార్ట్‌తోపాటు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, పలు యాప్‌లతో సతమతమవుతున్నామన్నారు. సోమ, గురువారాలు అడల్ట్ బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమం, బుధ, శనివారాలు చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు, ఫ్రైడే శానిటేషన్, ఫీవర్ సర్వేలు, కమ్యూనికేబుల్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్‌పై అవగాహన కార్యక్రమాలు ఇలా పలు సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన పెన్షన్‌పంపిణీ కార్యక్రమంలో కూడా పాల్గొంటున్నామన్నారు. ఈక్రమంలో ఇతర శాఖలకు సంబంధించిన స్కిల్ సర్వే నుంచి ఏఎన్ఎంలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస ఇందుకూరుపేట తాలూకా పబ్లిసిటీ సెక్రటరీ ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీ రాజ్యలక్ష్మి, సచివాలయ హెల్త్ సెక్రటరీలు సుజాత, యానాదమ్మ, సుశీల, హంస్నా, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో
లైసెన్సు మంజూరు చేయలేదు : సీఐ

పొదలకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణం ఏర్పాటుకు నిబంధనలకు విరుద్ధంగా ప్రతిపాదనలు ఉండడంతోనే మండలంలోని కడియాల లక్ష్మీకి చెందిన షాపు నెంబరు 154కు శాశ్వత లైసెన్స్‌ను మంజూరు చేయలేదని పొదలకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వీ.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లాటరీలో 154 నెంబరు దుకాణాన్ని పొందిన ఆమె మొదట తాత్కాలిక దుకాణాన్ని సూరాయపాలెంలో ఏర్పాటు చేశారని, అక్కడ ఆ దుకాణం సంగం - కలువాయి స్టేట్ హైవేకి అతి సమీపంలో ఉండడంతో 220 మీటర్ల అవతల షాపు చూసుకోవాలని తాము సూచించామన్నారు. తర్వాత పొదలకూరు మండలంలోని తోడేరు పంచాయతీ పరిధిలో నెల్లూరు ప్రధాన రోడ్డుకి సమీపంలో రెండు దుకాణాలను సూచించారన్నారు. ఆ రెండు దుకాణాలు నెల్లూరు-పొదలకూరు స్టేట్ హైవేకి అతి సమీపంలో ఉన్నందువలన శాశ్వత లైసెన్స్ మంజూరు చేయలేదన్నారు. ఈనెల 10వరకు లైసెన్స్‌కు ఈనెల 14 వరకు బ్యాంక్ గ్యారెంటీకి సమయం ఉందన్నారు. ఉద్దేశపూర్వ కంగానే వారు గురువారం నిర సన కార్యక్రమా న్ని చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్కిల్ పరి ధిలో లైసెన్స్ పొందిన మద్యం దుకాణదారులు ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మరాదని, బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు, రేపు ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

వెంకటాచలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం నుంచి రెండు రోజులపాటు ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ప్రత్యేక కలెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. వెంకటాచలంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలలో చేర్పులు, మార్పులు చేసుకోవచ్చన్నారు. కొత్త ఓటరు నమోదు, ఓటర్ల జాబితా నందు అభ్యంతరము ఉన్న ఓట్లు తొలగింపు వాటిపై దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఓటర్లు వారి పేరు ఓటర్ల జాబితాలో నమోదైనది లేనిది పరిశీలించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటి తహసీల్దారు విజయ్ పాల్గొన్నారు.

● ముత్తుకూరు(ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాలో పేరు నమోదు, మార్పులు చేర్పుల కోసం శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని తహసీల్దారు బాలకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈ నెల 23, 24తేదీల్లో కూడా ఈ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

● ఆలయాల్లో భక్తుల రద్దీ



మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్నభక్తులు



దీపదానమిస్తున్న భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగర వాసులు కోటి సోమవారం పర్వదినాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధల తో జరుపుకున్నారు. శివకేశవాలయాల్లో విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. సాయంత్రం భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి, బ్రాహ్మణులకు దీపదానమిచ్చారు.

● మూలస్థానేశ్వర ఆలయంలో తెల్లవారుజాము నుంచే అభిషేకాలు జరిగాయి. భక్తుల శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మూలస్థానేశ్వరస్వామికి, భువనేశ్వరి అమ్మవారికి విశేష పుష్పాలంకారం ఆకట్టుకుంది. రాత్రి ప్రాకారోత్సవం జరిగింది.

● రాజరాజేశ్వరి ఆలయంలో మీనాక్షి సమేత సుందరేశ్వ రస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాహుకాల దీపాలు వెలిగించారు.

● నవాబుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. రాత్రి కార్తీక దీపారాధనకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మూలవర్లుకు విశేష పుష్పాలంకారం జరిగింది.

రేషన్ బియ్యం పట్టివేత

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇంట్లో భారీగా నిల్వ ఉంచిన ఇద్దరిపై బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన మెంటా మధు మధ్యవర్తుల ద్వారా రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచారు. ఈ సమాచారం అందుకున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అధికారు లు దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి రూ.97,825 విలువ చేసే 66 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన రాచపూడి సంపూర్ణ ఇంట్లోనూ రూ.62,335 విలువ చేసే 42 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

భగత్ సింగ్ కాలనీలో కార్డెన్ సెర్చ్

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నేరాలకు అడ్డాగా మారిన భగత్ సింగ్ కాలనీ, జనార్దన్ రెడ్డి కాలనీ, టిడ్కో ఇళ్లల్లో శుక్రవారం నవాబుపేట పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా మాట్లాడుతూ కార్డెన్ సెర్చ్ లో ఇద్దరు ఎస్ఐ లు, 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారని, 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.



మహిళల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌స్పెక్టర్

కాలువలోకి దూసుకెళ్లిన కారు, బైక్



నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శుక్రవారం ఓ కారు, మోటారు బైక్ కాలువలోకి దూసుకెళ్లాయి. టీడీపీ జిల్లా కార్యాలయం సమీపంలోని కాలువలోకి వాహనాలు దూసుకెళ్లగా కారు ధ్వంసమైంది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

● అగ్రగామి కిసాన్ సభ నేత రామరాజు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా అగ్రగామి కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి పీవీ సుందరరామరాజు డిమాండ్ చేశారు. కిసాన్ సభ యొక్క జాతీయ మహాసభలు డిసెంబరు 15 నుంచి మూడు రోజుల్లో బీహార్ రాజధాని పాట్నాలో జరుగుతాయని తెలిపారు. శుక్రవారం నెల్లూరు టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో మహాసభ జిల్లా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల నుంచి రైతుల ప్రతినిధులు పాట్నా సభకు వస్తున్నారని, జిల్లా నుంచి 30 మంది రైతులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎంఎస్ రాజు, జనార్దన్, ఆనంద్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని సంతపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు... రంగనాయకులపేట గొల్లవీధి కాలువ కట్టకు చెందిన చంద్రశేఖర్ శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రజా సమస్యలపై పోరుబాట

విడవలూరు (ఆంధ్రజ్యోతి): ప్రభు త్వాలు మారిన పేదప్రజల తలరాతలు మారడంలేదని, దీంతో ప్రజా సమస్యల పై పోరుబాట పట్టామని సీపీఎం జిల్లా కార్యద ర్శివర్గ సభ్యుడు తూళ్లురు గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 14 వరకు జరుగుతుందన్నా రు. అందులో భాగంగా విడవలూరులో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బడుగు సుబ్బయ్య, మడపర్తి అంకయ్య, ఖాదర్ మస్తాన్, తలారి సురేష్, అమరశేఖర్ పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు యువత ముందుకు రావాలి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు యువత ముందుకు రావాలని జిల్లా లోక్ అదాలత్ సెక్రటరీ, సీనియర్ సివిల్ న్యాయాధికారి కే.వాణి అన్నారు. శుక్రవారం బుచ్చి నగర పంచాయతీలోని రామచంద్రాపురంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కుల సాధన కోసం నిర్భయంగా నిలబడి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

11న డయల్ యువర్ డీఎం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నెల్లూరు రెండో డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సూచనలు తెలుసుకునేందు కు ఈనెల 11వతేదీ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయం త్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రజలు, ప్రయాణికులు 9959225642 నెంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలుపవచ్చన్నారు.

సంక్షేమ పథకాలకు నిధులివ్వాలి

● కలెక్టర్‌కు అవాజ్ కమిటీ వినతి

నెల్లూరు (వైద్యం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని అవాజ్ కమిటీ కోరింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముస్లింల అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చారన్నారు. వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మైనార్టీ గురుకుల పాఠశాల పనులు ఇంకా పూర్తికాలేదన్నారు. నెల్లూరు రూరల్, అనంతసాగరం, ఆత్మకూరు మండలా ల్లో షాదీమంజిల్ పనులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. కేంద్రం చేపట్టనున్న వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవాజ్ కమిటీ సభ్యులు మొహమ్మద్ సర్దార్ అహ్మద్, పఠాన్ షబ్బీర్, మధు పాల్గొన్నారు.

బుచ్చిలో నిరసన

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనారిటీల అభివృద్ధికి, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని ఆవాజ్ బుచ్చి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జానీబాషా, బుచ్చి మండల అధ్యక్ష, కార్యదర్శులు, జక్రియ, మునీర్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కృషి

● రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యురాలు ప్రొఫెసర్ సీహెచ్ విజయ



వెంకటాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కృషి చేస్తానని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యురాలు, విక్రమ సింహపురి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తెలిపారు. వీఎస్‌యూ వీసీ డాక్టర్ విజయ భాస్కర్‌రావు సహకారంతో కాలుష్య నియంత్రణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి సమాజంలో మంచి మార్పు తీసుకురావాలన్నదే లక్ష్యమన్నారు.

ఇంటర్వ్యూ

? మీరు ఏం చేస్తే ప్రభుత్వం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యురాలిగా ఎంపిక చేసింది.

! కాలుష్య నియంత్రణలో ఉన్న దీర్ఘకాల అనుభవం, పరిశోధనల పట్ల నిబద్ధత, శాస్త్రీయ పరిశోధనల ద్వారా సామాజిక మార్పుని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించడం. పర్యావరణ పరిరక్షణకు సహకరించే సాంకేతికతను అభివృద్ధి చేయడంతో ప్రభుత్వం ఈ బాధ్యత అప్పగించింది.

? మీ పర్యవేక్షణలో ఎంతమంది విద్యార్థులు పరిశోధనలు చేశారు

! 12 ఏళ్లగా తన పర్యవేక్షణలో అనేక మంది విద్యార్థులు ప్రత్యేకించి జిల్లాలోని ఆక్వా రంగంపై పరిశోధనలు చేశారు. కాలుష్యం, దాని ప్రభావాలు, పరిష్కార మార్గాలతోపాటు వివిధ అంశాల్లో పరిశోధనలు చేశారు. నీరు, నేల కాలుష్యాలు, వాటి ప్రభావాలు, కాలుష్య నియంత్రణ విధానాలపై అధ్యయనాలు చేపట్టారు.

? కాలుష్య నియంత్రణ కోసం చేపట్టబోయే ప్రధాన చర్యలు ఏమిటి.

! కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రణాళిక రూపొందించడం, పర్యావరణానికి హాని కలిగించే అంశాలను గుర్తించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా కాలుష్య నియంత్రణకు కృషి చేస్తా.

? కాలుష్య నియంత్రణపై ప్రజలకు, విద్యార్థులకు ఇచ్చే సందేశం ఏమిటి.

! పర్యావరణానికి ముప్పు ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగస్వాములు కావాలి. ప్రకృతిని కాపాడడమే అందరి బాధ్యత అనే అంశంపై అవగాహన కల్పిస్తాం.

కల్యాణ వేంకటేశ్వరుడికి అభిషేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోటి సోమవారం సందర్భంగా బాలాజీనగర్ సీతారామ మందిరంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి శుక్రవారం విశేష అభిషేకాలు జరిగాయి. ప్రజాహిత సేవా సమితి వ్యవస్థాపకుడు కర్తం ప్రతాపరెడ్డి, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలను తిలకించిన భక్తులలో లక్కీడిప్ ద్వారా ఆరుగురిని ఎంపిక చేసి వస్త్రాలు బహూకరించారు. వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, రామాంజనేయులురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దినేష్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

హైవే కూడళ్లలో సెంట్రల్ లైటింగ్, సూచికలు

నెల్లూరు(సిటీ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించే జంక్షన్ల వద్ద ప్రమాద హెచ్చరికలు, సెంట్రల్ లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు, హైమాస్ట్ లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేషన్ అదనపు కమిషనర్ నందన్ తెలిపారు. శుక్రవారం రవాణా, ట్రాఫిక్, హైవే అథారిటీ అధికారులతో కలిసి జంక్షన్లను పరిశీలించారు. అన్నీ శాఖల అభిప్రాయాలు, సూచనల మేరకు ఈ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

ఇరగాళమ్మ సేవలో సోమిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారిని సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో గిరికృష్ణ, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి సోమిరెడ్డి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'అపార్'ను వేగవంతం చేయాలి

మనుబోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అపార్ కార్యక్రమం ద్వారా పిల్లల వివరాలు నమోదును వేగవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మనుబోలులోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అపార్ నమోదు రికార్డులను పరిశీలించారు. నెలాఖరుకల్లా ప్రక్రియ పూర్తికావాలన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.
నెల్లూరు ఏసీఎం - 9985411424

డ్రోన్ పోలీస్



డ్రోన్.. ఇక పోలీసు శాఖలోనూ భాగంకానుంది. ఇప్పటికే ఎన్నో రంగాల్లో వినియోగిస్తున్న డ్రోన్ టెక్నాలజీని.. భద్రత, ప్రమాదాల నివారణకూ ఉపయోగించుకోనున్నారు. పోలీస్ వెళ్లలేని చోటికి డ్రోన్‌ను పంపనున్నారు. ఇందులోని కెమెరాల ద్వారా నిఘా పెట్టి.. పర్యవేక్షించి.. చర్యలు చేపట్టనున్నారు. దీనికిగాను ప్రయోగాత్మక పరిశీలన మొదలైంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

● శాంతి భద్రతలు, ట్రాఫిక్, వాహనాల వేగం నియంత్రణ, వీఐపీల భద్రతకు వాడకం

చాలీచాలని సిబ్బంది, పెరుగుతున్న నేరాలు, శాంతి భద్రతల కట్టడి పోలీసులకు సవాల్‌గా మారుతున్న నేపథ్యంలో డ్రోన్ల వినియోగంతో సెక్యూరిటీ వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు చేపడుతున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనకు తిరుపతి నుంచే శ్రీకారం చుట్టాలని భావించారు. ప్రాథమికంగా పాకాల సర్కిల్‌లో బుధవారం సీఐ మద్దయ్యాచారి ఆధ్వర్యంలో నేషనల్ హైవేలో డ్రోన్లు వినియోగించి వాహనాల వేగం నియంత్రించడం, వాహనం అధిక లోడుతో ఏమైనా వస్తోందా అనే విషయాలను గుర్తించారు. ప్రయోగాత్మకంగా పరిశీలించి.. ఆ తర్వాత జిల్లా అంతటా వినియోగించాలనే ఆలోచనతో ఉన్నారు. ప్రధానంగా తిరుపతి, తిరుమల సబ్ డివిజన్ల పరిధిలో నిత్యం వీఐపీల తాకిడి ఉంటుంది. వీరి భద్రత పరంగా ప్రత్యేక నిఘా ఉంచడానికి సిబ్బంది చాలకపోవడంతో డ్రోన్లు వినియోగించి భద్రతా వ్యవస్థను మెరుగుపరచాలనే ఆలోచనతో అధికారులు ఉన్నారు. మరోవైపు నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారి, తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున ఆ రహదారుల్లోని ప్రధాన కూడళ్లు, నేరో పాయింట్లు, మలుపులు, కిలోమీటర్ల దూరం నేరుగా వున్న రోడ్లలో డ్రోన్లు వినియోగించి ఎక్కడో ఒక చోట కూర్చుని డిజిటల్ వ్యవస్థ ద్వారా వీక్షించి తద్వారా అవసరమైన నివారణ చర్యలు తీసుకోవడానికి వీలుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా శేషాచలం అడవులు నుంచి అత్యధికంగా ఎర్రచందనం అక్రమ రవాణా అవుతోంది. దీంతో అటవీ ప్రాంతాల్లో డ్రోన్లు పంపి స్మగ్లర్లు ఎక్కడున్నారు? ఎక్కడెక్కడ ఎర్రచందనం వృక్షాలు వున్నాయి? మానవ సంపద అక్రమంగా తరలి పోకుండా కొన్ని కిలోమీటర్ల దూరంలో నుంచి వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు ఏకాంత కాలనీలు, శివారు ప్రాంతాలు, మాస్ ఏరియాలు, రౌడీయిజం, గూండాయిజం ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో వీటిని వినియోగించి కొంతవరకు అదుపు చేయడానికి అవకాశం ఉంటుందని ఓ అధికారి చెప్పారు. అసాంఘిక శక్తుల కదలికలు, గంజాయి విక్రయాలు, వినియోగం, రవాణా, రౌడీలు, కేడీలపై ఎప్పటికప్పుడు నిఘా వుంచడానికి ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న క్రమంలో డ్రోన్ల ద్వారా తెలుసుకోవడానికి ఉన్న సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తున్నారు. తిరుపతి లాంటి నగరంలో ట్రాఫిక్ స్తంభించినప్పుడు, అడ్డదిడ్డంగా వాహనాలు ఆపడం, నడి రోడ్లపై వాహనాలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి పనులు చేసే వారిని డ్రోన్ల ద్వారా వీడియోలు చిత్రీకరించి.. సంబంధిత పోలీసు సిబ్బందికి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేయడం ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరం ఉంటుంది. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను డ్రోన్ ద్వారా రోడ్లను చిత్రీకరించి అక్కడ ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకునే వెసులుబాటు వుంటుంది.

ప్రతి సబ్ డివిజన్‌కు ఒక డ్రోన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి సబ్ డివిజన్‌కు ఒక డ్రోన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డ్రోన్ల ద్వారా దాదాపు మూడు కిలోమీటర్ల రేడియస్‌తో దాదాపు 300 అడుగుల ఎత్తు వరకు మాత్రమే ఎగిరి వీడియోగ్రఫీ చేస్తాయి. వాటి కంటే ఎక్కువ శక్తిమంతమైన డ్రోన్లు తెప్పించడానికి అధికారులు ఆలోచిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. వీలైనంత త్వరగా డ్రోన్లు తెప్పించే ప్రయత్నంలో అధికారులు వున్నారు.



నేంద్రగుంట వద్ద డ్రోన్‌తో వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న సీఐ మద్దయ్యాచారి



పుష్పయాగానికి అంకురార్పణ

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం నిర్వహించే పుష్పయాగానికి శుక్రవారం రాత్రి అంకురార్పణ జరిగింది. ఉదయం మూలవిరాట్టు ఎదురుగా ఆచార్య రుత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే రుత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు. ఇందులో భాగంగానే సాయంత్రం శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడిని ఆలయం నుంచి వసంత మండపానికి వేంచేపు చేశారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం సహస్రదీపాలంకారసేవను టీటీడీ రద్దు చేసింది.

16 రకాల పుష్పాలతో నేడు పుష్పాభిషేకం

పుష్పయాగంలో భాగంగా శనివారం శ్రీవారి ఆలయంలో రెండో అర్చన, రెండో గంట, నైవేద్యం తర్వాత ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పాలు, పత్రాలతో పుష్పయాగాన్ని నిర్వహిస్తారు. దీనికోసం టీటీడీ ఉద్యానవనం విభాగం 16 రకాల పుష్పాలు, ఆరు రకాల పత్రాలను సిద్ధం చేసింది. పుష్పార్చనకు, అలంకరణలకు దాదాపు 8 టన్నుల పుష్పాలను సిద్ధంగా ఉంచారు.




ద్వారకానాథరెడ్డి - హేమాంజి

పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, అధ్యాపకుడికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు

తిరుపతి(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాథరెడ్డి, కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ జి.హేమాంజి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. ఏటా రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యకు సంబంధించి ఉత్తమ ప్రిన్సిపాల్, విభాగాధిపతి, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకుల విభాగాల్లో ఉత్తమ అధ్యాపకులను ఎంపికచేసి సత్కరిస్తుంది. 2023-24 సంవత్సరానికి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా వై.ద్వారకనాథరెడ్డి, సీనియర్ అధ్యాపకుల విభాగంలో డాక్టరు జి.హేమాంజి ఎంపికయ్యారు. ఈనెల 11వ తేదీన విజయవాడలో వీరు అవార్డులను అందుకోనున్నారు. అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు వారిని అభినందించారు.



యువతరంగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

క్రీడా సాంస్కృతిక రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలి

● 'యువ తరంగ్' ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడా సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు. తిరుపతిలోని ఎస్వీయూలో శుక్రవారం ఆయన 'యువ తరంగ్-2024' కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువత కళాభిరుచిని పెంచుకోవడం ద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. క్రీడా సాంస్కృతిక రంగాల్లో రాణించే వారికి విద్య, ఉద్యోగాల్లోనూ ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. ప్రాథమిక దశ నుంచే క్రీడా, సాంస్కృతిక అంశాల పట్ల ఆసక్తి పెంపొందిస్తే మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవరచుకునే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఈసీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, ప్రిన్సిపాళ్లు నరసయ్య (కామర్స్), రామకృష్ణారెడ్డి (సైన్స్), అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, విద్యార్థులు, ఉద్యోగులు, కళాకారులు పాల్గొన్నారు.

ఒకటో సారి..!

● శ్రీధనమల్లిలో బెల్టుషాపు నిర్వహణకు వేలం పాట

● గ్రామ పెద్దల నిర్వాకంపై సోషల్ మీడియాలో వైరల్ చేసిన యువత



శ్రీధనమల్లిలో గురువారం రాత్రి వేలం పాటల నిర్వహణలో గ్రామ పెద్దలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ సురేంద్రబాబు

దొరవారిసత్రం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి గ్రామంలో మద్యం బెల్టుషాపు నిర్వహణకు గురువారం రాత్రి వేలం పాట నిర్వహించారు. ఇప్పటికే ఆ గ్రామంలో ఇద్దరు చిల్లర దుకాణదారులు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఒక్కరే బెల్టుషాపు నిర్వహించాలని అధికార పార్టీకి చెందిన ఆ గ్రామ పెద్దలు కొందరు వేలం పాట పెట్టారు. గ్రామస్తుల సమక్షంలో నిర్వహించిన ఈ వేలం పాటలో రూ.1.6 లక్షలను గ్రామానికి చెల్లించి ఒక్కరే బెల్టుషాపు నిర్వహించుకునేలా గ్రామంలో పెద్దలు వేలం పాట ద్వారా నిర్ణయించారు. గ్రామంలో బెల్టు షాపే ఉండకూడదని భావించిన కొంత మంది యువత గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన వేలం పాట నిర్వాహకాన్ని తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించి శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. బెల్టు షాపు కోసం వేలం పాట వైరల్ కావడంతో సూళ్లూరుపేట ఎక్సైజ్ సీఐ సురేంద్ర బాబు తమ సిబ్బందితో గ్రామంలోకి వెళ్లి బెల్టుషాపు నిర్వహిస్తే నిర్వాహకుడిమీదే కాకుండా వేలం పాట నిర్వహించిన గ్రామ పెద్దలపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బెల్టు షాపు ఎటువంటి పరిస్థితిలో నిర్వహించరాదని గ్రామస్తులకు తెలిపారు.

నేడు హౌసింగ్‌పై మంత్రి సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం కలెక్టరేట్‌లో హౌసింగ్‌పై అధికారులతో సమీక్షిస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రగిరి మండలం తొండవాడ లేఅవుట్‌ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడతారు. రాత్రి తిరుమలకు చేరుకుని, బస చేస్తారు. ఆదివారం ఉదయం స్వామి వారిని దర్శించుకుని విజయవాడకు రోడ్డు మార్గాన వెళతారు.

శిల్పారామం ఘటనలో గాయపడ్డ మరో మహిళ మృతి



గౌతమి (ఫైల్ ఫొటో)

తిరుచానూరు/కేవీబీపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం క్రాస్‌వీల్ బాక్సు విరిగి పడటంతో గాయపడ్డ గౌతమి (18) శుక్రవారం మృతిచెందారు. అదే బాక్సులో కూర్చుని ఉన్న తిరుపతిలోని సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన లోకేశ్వరి ఘటనా స్థలంలోనే మృతిచెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన గౌతమి ఆరురోజులుగా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గౌతమి మృతదేహానికి రుయా మార్చురీలో శవ పంచనామా నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని వీరి స్వగ్రామమైన కేవీబీపురం మండలం పెరిందేశానికి తీసుకొచ్చారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి రూ.55వేల చెక్కును మృతురాలి కుటుంబీకులకు అందజేశారు. కాగా, క్రాస్‌వీల్ ఘటనపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. శిల్పారామం సంస్థల సీఈవో స్వామినాయుడు తిరుపతికి చేరుకుని పూర్తి విచారణ చేసి సమగ్ర నివేదికను రాష్ట్రప్రభుత్వానికి అందజేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై కాంట్రాక్టర్ ప్రభాకర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తూపిలిపాళెంలో ఎన్ఐవోటీ పరిశోధన కేంద్రం



తూపిలిపాళెం వాగురు వద్ద శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న రవిచంద్రన్

వాకాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వాకాడు మండలంలోని తూపిలిపాళెం వాగురు వద్ద సముద్ర జలాలపై పరిశోధన కోసం ప్యాలెస్ వాటర్ ట్రీట్‌మెంట్, ఫెసిలిటీ సెంటర్‌కు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఎస్ సైన్సెస్ సెక్రటరీ రవిచంద్రన్ మాట్లాడుతూ సముద్రంలోని బ్యాక్టీరియాలపై పరిశోధన కోసం ఆధునిక టెక్నాలజీలతో ఎన్ఐవోటీ ల్యాబ్‌ను ప్రారంభించామని, ఇక్కడ మైక్రో బయాలక్ కల్చర్‌పై పరిశోధన జరుగుతుందన్నారు. తమిళనాడు కేంద్రంగా ఉన్న ఎన్ఐవోటీ ప్రధాన కార్యాలయం నుంచి ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తామని వెల్లడించారు. భూకంపం, సునామీ, తుఫాన్ వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే ఈ కేంద్రం పసిగడుతుందని, తద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికి వీలుంటుందన్నారు.సముద్రంలో దొరికే ఖనిజాలు, కణజాలు తదితర అంశాలపై ఎన్ఐవోటీ పరిశోధన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ రామకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్, చీఫ్ ఇంజనీర్ ఎం.వెంకటేశ్వర్లు, డీప్ ఓషన్ మిషన్ డైరెక్టర్ ఎం. రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిట్టేడులో మైక్రోబియల్ కేంద్రానికి శంకుస్థాపన

కోట, ఆంధ్రజ్యోతి: కోట మండలం చిట్టేడులో మైక్రోబియల్ కేంద్రానికి కేంద్ర పృథ్వీ విజ్ఞానమంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్ శుక్రవారం భూమిపూజ చేశారు. రూ.17 కోట్లతో సముద్ర మైక్రోబియల్ రిపోచిటరి కేంద్రాన్ని నిర్మించనున్నారు. దీని ద్వారా సముద్రంలో చేపలు, రొయ్యలు, జలచరాలతో పాటు మత్స్యకారులకు ఎలాంటి జల, వాయు, కాలుష్యం లేకుండా జలశుద్ధి చేస్తారని అధికారులు తెలిపారు. దీంతో మత్స్యకారులకు, చేపలకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చూడవచ్చన్నారు. ఎన్ఐవోటీ పీఆర్‌వోలు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ ఎంపికకు పరీక్ష వాయిదా

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత డీఎస్సీ శిక్షణ నిమిత్తం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల ఎంపిక కోసం ఆదివారం నిర్వహించనున్న కంప్యూటర్ పరీక్ష వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల్లో శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో పోస్ట్

● వైసీపీ సానుభూతి పరుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాను వేదికగా చేసుకుని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వైసీపీ సానుభూతిపరుడు హరీశ్వరరెడ్డిని తిరుపతి ఈస్ట్ పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన హరీశ్వరరెడ్డి హదరాబాదులో ఉంటున్నాడు. కొద్ది రోజులుగా ప్రభుత్వానికి, అటు పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా ఒక మహిళ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఇతడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నాడు. దీనిపై తిరుపతి జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈస్ట్ సీఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. హరీశ్వరరెడ్డిని ఈస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి వెనుక ఉన్న మరికొంతమందిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ రామకృష్ణ చెప్పారు.



పనబాక లక్ష్మి | జ్యోతుల నెహ్రూ | కృష్ణమూర్తి వైద్యనాథన్ | సదాశివరావు | సౌరభ్ బోరా

టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

తిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యులుగా జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, సౌరభ్ బోరా, సదాశివరావు, కృష్ణమూర్తి వైద్యనాథన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు.అనంతరం శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న వారిని వేదపండితులు ఆశీర్వదించారు.అదనపు ఈవో శ్రీవారి చిత్రపటాలు,లడ్డూప్రసాదాలు అందజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం పనబాక లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ.. తనను టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమించిన సీఎం చంద్రబాబుకు, లోకేశ్‌కు ధన్యవాదాలు అన్నారు.దేవదేవుడికి సేవ చేసుకునే అదృష్టం కలిగించిన సీఎంకు జ్యోతుల నెహ్రూ కృతజ్ఞతలు తెలిపారు.తిరుమలకు సామాన్యుడిగా, వీఐపీగా వచ్చిన సందర్భాలున్నాయన్నారు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సేవలందిస్తానన్నారు.

వేద విద్యార్థులు సనాతన ధర్మాన్ని ప్రబోధించాలి

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): వేద విద్యార్థులందరూ తమ కోర్సుల్లో నైపుణ్యం సాధించి సనాతన ధర్మాన్ని ప్రబోధించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. తొలిసారిగా వేదవిజ్ఞాన పీఠానికి వచ్చిన చైర్మన్‌కు ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ అవధాని వేదమంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనం నిర్వహించి సంప్రదాయపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో చైర్మన్ మాట్లాడుతూ.. ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని, మరోసారి త్వరలో విద్యార్థులందరినీ కలుస్తానన్నారు. సనాతన ధర్మాన్ని మరింత ఉన్న శిఖరాలకు తీసుకెళ్లాలన్నదే తమ సంకల్పమన్నారు. తొలుత ప్రిన్సిపాల్ తిరుమలలో వైదిక సంస్థ ఆవిర్భావం, ప్రాభవం గురించి చైర్మన్‌కు వివరించారు. అక్కడి నుంచి చైర్మన్ తిరుమలలోని గోశాలను సందర్శించారు. నవనీత సేవలో స్వయంగా పాల్గొని సేవకులు చేస్తున్న సేవలను పరిశీలించారు. ఏకాంత సేవకు వినియోగించే వెన్నను తయారు చేసే విధానాన్ని చూశారు. వెన్నను స్వయంగా తన చేతులపై సేవకులకు అందజేశారు. గోపూజలోనూ పాల్గొన్నారు. అక్కడి నుంచి పెద్దజీయర్ మఠానికి వెళ్లి పెద్దజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. తర్వాత అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమాల్లో ధర్మగిరి ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఉరకలెత్తిన యువ తరంగం





స్టెప్పులేశారు. పాటలుపాడారు. శాస్త్రీయ నృత్యాభినయంతో అలరించారు. దేవతామూర్తులు, శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజాలు.. ఇలా విభిన్న వేషధారణలతో ఆకట్టుకున్నారు. కోలాటాలతో ప్రదర్శన ఇచ్చారు. చదువులోనే కాదు కళలలోనూ తమ ప్రావీణ్యాన్ని చాటారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైన మూడు రోజుల 'యువ తరంగ్' కార్యక్రమంలో యువోత్సాహం ఉరకలెత్తింది. శ్రీనివాస ఆడిటోరియం వేదికగా కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణంలో కళా బృందాల ర్యాలీ, ప్రదర్శన ఆకట్టుకుంది. పలు కళాశాలలకు చెందిన వేలాది మంది కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.







నేటి కార్యక్రమాలిలా..

శనివారం ఉదయం 10 నంచి యూనివర్సిటీలోని పలు కేంద్రాల్లో వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్లాస్టిక్‌రహిత తిరుపతి అంశంపై శ్రీనివాసా ఆడిటోరియంలో సామాజిక కార్యకర్త శివాజీ పలేటి ప్రసంగించనున్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

అత్యవసర సేవకులకు జీతాలెక్కడ?

● నాలుగు నెలలుగా 108, 104 సిబ్బందికి అందని వేతనాలు



వేతనాలు చెల్లించాలని ఇటీవల నిరసన వ్యక్తం చేస్తున్న 108 సిబ్బంది

తిరుపతి(వైద్యం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు చేర్చి వైద్య సేవలు అందేలా చూసే 108, పల్లెవాసుల ఆరోగ్య భద్రతకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించే 104 సిబ్బంది సమస్యలు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. నాలుగు నెలలుగా జీతాలు అందక వారు అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణ భారమై అప్పులు చేసి, కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

తిరుపతి జిల్లా పరిధిలో 108 వాహనాలు 41, 104 వాహనాలు 34 ఉన్నాయి. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది పనిచేస్తున్నారు. 108 వాహనంలో ఇద్దరు చొప్పున డ్రైవర్లు, టెక్నీషియన్లు ఉంటారు. సీనియర్ డ్రైవర్లకు నెలకు రూ.27 వేలు, జూనియర్లకు రూ.16 వేలు వేతనం ఇస్తారు. సీనియర్ టెక్నీషియన్‌కు రూ.28 వేలు, జూనియర్లకు రూ.16 వేలు ఇస్తారు. 104 వాహనంలో డ్రైవర్లకు రూ.24 వేలు, రూ.13 వేలు చొప్పున, డీఈవో(డేటా ఎంట్రీ ఆపరేటర్)లకు రూ.13వేలు చొప్పున వేతనం చెల్లిస్తారు. నాలుగు నెలలుగా జీతాలందక ఆర్థికంగా సతమతమవుతున్నారు. 102 తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేసే సిబ్బందిదీ ఇదే పరిస్థితి.

ఏనాడూ సకాలంలో అందని వేతనాలు

108, 104 వాహనాల్లో పనిచేసే సిబ్బందికి ప్రారంభం నుంచి ఏనాడూ సకాలంలో జీతాలు అందలేదు. ప్రతినెలా ఎదురు చూపులు తప్పడం లేదు. ఇదేమని సంస్థ నిర్వాహకులను అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని సమాధానం చెబుతున్నారని, దసరా, దీపావళి వంటి పండుగల సమయాల్లోనూ జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో, క్రెడిట్ కార్డుల్లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించి, సకాలంలో జీతాలు అందేవిధంగా చూడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు
పోటీలు దోహదం చేస్తాయి

● మాజీ మంత్రి గల్లా అరుణకుమారి
● డాక్టర్ జగదీశ్‌కి గల్లా జీవితసాఫల్య పురస్కారం ప్రదానం
● ముగిసిన క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ 10వ వార్షికోత్సవాలు



జగదీశ్‌కి పురస్కారం ప్రదానం చేస్తున్న అరుణకుమారి

తిరుపతిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంపెనీలలో పనిచేసే ఉద్యోగుల్లో అంతర్లీనమై ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని మాజీమంత్రి గల్లా అరుణకుమారి అన్నారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ 10వ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. క్వాలిటీ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్‌ని స్థాపించడంలో ప్రధాన భూమిక పోషించి, దానికి ఆర్థికంగా, సంస్థాగతంగా సహాయసహకారాలు అందించిన అమరరాజా గ్రూప్స్ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు గౌరవార్థం ఆయన పేరుపై గల్లా జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రవేశపెట్టారు. ఆరోగ్య రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ జగదీశ్‌కి ఈ అవార్డును ముఖ్య అతిథిగా హాజరైన అరుణకుమారి చేతుల మీదుగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని అతిపెద్ద సర్కిల్స్‌లో తిరుపతి చాప్టర్ ఒకటిగా ఉండడం చాలా సంతోషదాయకమన్నారు. చాప్టర్ ఆధ్వర్యంలో ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఉద్యోగుల ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుందని, అలాగే సంస్థల్లో క్వాలిటీ విభాగాన్ని మెరుగుపరచుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అవార్డు గ్రహీత డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి అత్యున్నత స్థాయికి ఎదిగిన రామచంద్రనాయుడు అనేక సంస్థలను ఏర్పాటు చేసి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. అవార్డు అందించిన క్వాలిటీఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్‌కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంస్థల నుంచి దాదాపు 2వేలమంది, 303బృందాలు హాజరయ్యాయి. వివిధ సమస్యలకు వారు కనుగొన్న పరిష్కార మార్గాలు, సాధించిన ఫలితాలను ఈ పోటీల్లో వివరించారు. 20 బృందాలకు బెస్ట్ క్వాలిటీ సర్కిల్ అవార్డులు, క్వాలిటీ సర్కిల్స్ అమలు చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన పది సంస్థలకు, నాయకత్వ ప్రతిభచాటిన 15మంది ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. అలాగే బంగారు, వెండి పతకాలను అందజేశారు. ఏపీఐఐసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఐఎల్ రామ్, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, అమరరాజ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ డిల్లీబాబు, బ్లిస్ హోటల్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాక్మెన్ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ జగదీశ్, తిరుపతి చాప్టర్ చైర్మన్ జగన్‌మోహన్, జనరల్ సెక్రటరీ సులోచన తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ప్రత్యేక టూర్ ప్యాకేజీ

తిరుపతి అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్తీకమాస ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలను వెల్లడించారు.

● **మహానంది-శ్రీశైలం టూర్ :** మహానంది, శ్రీశైలం నాన్ ఏసీ బస్సు ఈ నెల 16, 23 తేదీల్లో ఉదయం 9గంటలకు బయల్దేరి మూడో రోజు ఉదయం 6 గంటలకు తిరిగి వస్తుంది.పెద్దలకు రూ.3,300,పిల్లలకు రూ.2,540 చెల్లించాలి.

● **తలకోన టూర్ :** తలకోన, శ్రీనివాసమంగాపురానికి ప్రతి ఆది, సోమవారాల్లో నడుస్తుంది. ఉదయం 9 గంటలకు బయల్దేరి సాయంత్రం 5గంటలకు తిరిగి వస్తుంది. ఒక్కొక్కరికి రూ.400 చెల్లించాలి.

● **గుడిమల్లం టూర్ :** రోజూ తిరుచానూరు, అప్పలాయగుంట, గుడిమల్లం మీదుగా నడుస్తుంది. ఒక్కొక్కరికి రూ. 400 చెల్లించాలి.

తిరుపతి విష్ణునివాసం నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాల కోసం 9848007033, 0877-2289123లను సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రాలయం రాఘవేంద్ర మఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామి, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జనార్దన్‌రావు, విరుపాక్ష, విష్ణుకుమార్ రాజు, క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, గాయకుడు కార్తీక్, సినీనటుడు గబ్బర్‌సింగ్ సాయి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



కార్తిక్ - సుబుదేంద్రతీర్థ స్వామి - కృష్ణమాచారి శ్రీకాంత్

సుస్థిర పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి

తిరుచానూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా మామిడి సాగులో అధిక దిగుబడి, నాణ్యతను సాధించవచ్చని రాష్ట్ర ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ హరినాథరెడ్డి తెలిపారు. తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో మామిడి విలువపై భారతీయ పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మామిడి పండించే అగ్రగామి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటన్నారు. రాష్ట్రంలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లకు, ముఖ్యంగా వాతావరణం- స్మార్ట్ టెక్నాలజీలను అవలంబించడం, పంట కోత అనంతరం నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడంలో వినూత్న పరిష్కారాలను చర్చించడానికి ఇది ఒక వేదిక అన్నారు. ఈ వేదిక రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, వ్యవసాయ సాంకేతిక నిపుణులు, ఉద్యానశాఖ, నాబర్డు, ఇతర కీలక సంస్థల ప్రతినిధులను ఒక చోట చేర్చిందని తెలిపారు. సెన్సార్ ఆధారిత వ్యవసాయం, వాతావరణ ఆధారిత వ్యవసాయం, మామిడి పంట వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్, ఎగుమతి, నాణ్యత తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ చైర్మన్ పుష్పిత్‌గార్గ్, లక్ష్మీప్రసాద్, విజయవిహార, నాబార్డు ఏజీఎం సునీల్, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలు, వ్యవసాయ సాంకేతిక సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

క్షేత్ర సహాయకుల అవినీతిపై విచారణ



కొత్తపట్నంలో బహిరంగ విచారణ చేస్తున్న ఎంపీడీవో, ఏపీడీ

కోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం, కోట, జరుగుమల్లి గ్రామాల్లో పనిచేస్తున్న క్షేత్ర సహాయకుల అవినీతిపై శుక్రవారం బహిరంగ విచారణ జరిగింది. ఎంపీడీవో వేణు, డ్వామా ఏపీడీ వరప్రసాద్, ఏపీవో పూర్ణిమ, పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు ఆయా పంచాయతీల్లో విచారణ చేశారు. క్షేత్ర సహాయకులు అవినీతికి పాల్పడ్డారని పలువురు కూలీలు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా భోగస్ మస్టర్లు తయారు చేసి ఉపాధి నిధులు స్వాహా చేశారంటూ ఆరోపించారు. విచారణ వివరాలను నివేదిక రూపంలో డ్వామా అధికారులకు అందజేస్తామని ఎంపీడీవో, ఏపీడీ తెలిపారు.

ఓజిలికి తెలుగుగంగ నీరు: విజయశ్రీ



ఊట్లపల్లి వద్ద గంగ కాలువకు జలహారతి పడుతున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ, కురుగొండ్ల

ఓజిలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ అదును దాటుతున్న నేపథ్యంలో ఓజిలి మండలంలో రైతాంగానికి తెలుగుగంగ నీటిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ విడుదల చేశారు. శుక్రవారం బాలాయపల్లి మండలం ఊట్లపల్లి వద్ద తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి 5వ బ్రాంచి కాలువకు నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ఓజిలి మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయ కుమార్ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ముసులూరు శ్రీనివాసులు, ముస్లిం నాయకులు రఫీ, నాయకులు వల్లూరు రమేష్, సురేష్‌రెడ్డి, బాబు నాయుడు, మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

నాయుడుపేట టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. నాయుడుపేట పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త గుజ్జలపూడి కమలాకర్‌నాయుడు మృతి చెందారు. ఆయన కుటుంబసభ్యులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2,92,187, అనారోగ్యంతో చికిత్స పొందిన రామకృష్ణయ్యకు రూ.88,100, నగరం మునిరాజాకు రూ.35వేల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ నాయకులు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, ఖలీల్, సంచి కృష్ణయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి బాలాజీని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థి బాలాజీని విద్యానికేతన్ పాఠశాల సిబ్బంది శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మల్లికార్జున మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన బాలాజీ అండర్-17 విభాగంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 17వ తేదీన హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున బాలాజీ ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ధర్నాను విజయవంతం చేయండి

గూడూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద మంగళవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పాతబస్టాండులో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించి జనాభా ప్రాతిపాదికన పార్లమెంటు, అసెంబ్లీల్లో బీసీలకు సీట్లు కేటాయించాలన్న డిమాండ్‌తో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌పీ సుబ్బయ్య, భాస్కర్ గౌడ్, వెంకటేశ్వరరాజు, రమేష్, గురునాధం, జగదీష్ పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ



భూమి చేస్తున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోటకట్ల గ్రామంలో శుక్రవారం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు పాకం వెంకటసుబ్బయ్య, తిరుపాల్, గొంజి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు కె.నాగరాజు, కె.సుధాకర్, బాలకృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాపోరు: సీపీఎం

వెంకటగిరి, నవంబరు 8: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో శుక్రవారం నుంచి ఇంటింటి ప్రచార కార్యక్రమం ప్రారంభించినట్లు ఆ పార్టీ నాయకుడు వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మొగళ్ళగుంట గ్రామంలో నిర్వహించిన ప్రజాపోరు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజుకు పెరుగుతున్న నిత్యావసర, కూరగాయలు, వంట నూనె ధరలను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పెంచలయ్య, నాగమణి, లక్ష్మమ్మ, శంకరమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 'స్నేహహస్తం'

గూడూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు స్నేహహస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ వద్ద స్నేహహస్తం(గ్రీవెన్ డే) నిర్వహించారు. రైల్వే అధికారులు సతీష్, మునిబాబు, రవికుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రాంగోపాల్‌రెడ్డి కన్నుమూత



సూళ్లూరుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్త, తెలుగుభాషా బోధకుడు రాంగోపాల్‌రెడ్డి(81) కన్నుమూశారు. సూళ్లూరుపేట జూనియర్, డిగ్రీ కాలేజీల్లో సుదీర్ఘకాలం ఆయన లెక్చరర్‌గా చేశారు. దేవదాసీ వ్యవస్థ మీద ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా లభించింది. ఆత్రేయ కళాపీఠం వ్యవస్థాపకుల్లోనూ ఆయన ఒకరు. సూళ్లూరుపేట హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘంలో క్రియాశీల పాత్ర పోషించేవారు. అనేక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన గురువుగా ఆయనకు ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. శుక్రవారం సాయంత్రం ఆయన కన్నుమూశారు. శనివారం ఉదయం పదిగంటలకు సూళ్లూరుపేట సాయిబాబా గుడి ఎదురుగా ఆయన స్వగృహం వద్ద అంత్యక్రియల కార్యక్రమం జరుగుతుంది. రాంగోపాల్ రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువు హఠాన్మరణం పట్ల సూళ్లూరుపేట హైస్కూల్, జూనియర్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం సంతాపం ప్రకటించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, వెంకటగిరి, నాయుడుపేట, పెళ్లకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారు పోలూరులో ఉన్న 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నాం 1గంట వరకు సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరు, వట్రపాలెం, సాయినగర్, సూళ్లూరు, జీఎన్‌టీ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ శేఖర్ తెలిపారు.

- వెంకటగిరి పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నాం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ ముని రవిచంద్ర తెలిపారు.
- నాయుడుపేట పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నాం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆశాఖ అధికారులు తెలిపారు.
- పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు, చిల్లకూరు, కప్పగుంట కండ్రిగ, చెంబేడు క్రాస్ రోడ్డు సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నాం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేష్‌బాబు తెలిపారు.

ఆహారపొట్లాల పంపిణీ

గూడూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గావీధిలో శుక్రవారం బాస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రవీంద్ర బాబు, యశ్వంత్, భావన, బాబ్జీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.





ఆలయ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలు - ఆలయ భూమికి కంచె వేసిన వైనం

రాముడి భూములకు రక్షణ కరువు

- రూ.కోట్ల విలువైన రామాలయ భూములు అన్యాక్రాంతం
- ప్రైవేటు భవనాలు, రోడ్ల ఏర్పాట్లకు సన్నాహాలు
- చందాలతో ధూప, దీప, నైవేద్యాలు
- పట్టించుకోని దేవదాయశాఖ

ఓజిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి శ్రీరాముడు ధనవంతుడు... అయితే ఆయనకు ధూప, దీప, నైవేద్యాలు సమర్పించాలంటే చందాలు వేసుకోవాల్సిందే... గ్రామానికి ముఖ ద్వారంలోనే రాములవారికి కోట్ల రూపాయల విలువైన భూములు ఉన్నాయి. ఇవి క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. అసలు ఈ భూములు ఆ శాఖలో ఉన్నాయన్న సంగతి ఇటీవలి వరకు వెలుగులోకి రాలేదంటే విచిత్రమే. ఓజిలి మండలం ఆరిమేనిపాడు గ్రామంలోని శ్రీరామ మందిరం భూముల పరిస్థితి ఇది. గ్రామంలో రాముడి ఆలయానికి సర్వే నెంబరు 172/12లో 5.67 ఎకరాల తాటితోపుగా పిలువబడే భూములు ఉన్నాయి. గ్రామానికి చెందిన ఐదుగురు పెద్దలు రెండు తరాలుగా ధర్మకర్తలుగా ఉన్నారు. కాలక్రమంలో వారిపేరుతోనే ఆలయ భూములకు పట్టాలు వచ్చాయి. దీనిని గమనించిన అప్పటి గ్రామపెద్దలు, సర్పంచులు భూములను శ్రీరాముడి ఆలయం పేరుతో పట్టాలు చేయించారు. ఈక్రమంలో 2002 సంవత్సరంలో ఈ భూములను దేవదాయ శాఖ పరిధిలోకి తెస్తూ తూర్పుకనుపూరు ఈవో ఆధీనంలోకి మార్చారు. అయితే దేవదాయ శాఖ అధికారులు ఆరిమేనిపాడులోని శ్రీరామ మందిరం ఆలనాపాలనపై దృష్టిపెట్టలేదు. దీంతో గ్రామంలో ఎవరికి వారు ఆక్రమణలకు పాల్పడుతూ తమకు అనుకూలమైన ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పంచాయతీ భవన శంకుస్థాపనకు విఫలయత్నం

దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈ భూముల్లో 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కొందరు పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. అప్పటి విద్యాశాఖ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి శంకుస్థాపనకు వెళ్లిన సమయంలో పంచాయతీ సర్పంచి కొండూరు ఈశ్వరరాజు దేవదాయ భూముల విషయం మంత్రికి తెలియజేయడంతో ఆమె కార్యక్రమాన్ని విరమించుకుని వెళ్లిపోయారు. కాగా, ప్రస్తుతం కూటమా ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమంలో ఈ భూముల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. తీరా ఈ భూములు దేవదాయ శాఖ పరిధిలో ఉన్నాయని తెలియడంతో మిన్నకుండిపోయారు.



ఆరిమేనిపాడులోని శ్రీరాముడి ఆలయం

చందాలతో ధూప, దీప, నైవేద్యాలు

కోట్ల రూపాయల విలువైన భూములు ఉన్నా శ్రీరాముడి ధూప, దీప, నైవేద్యాలకు చందాలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీదైన భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారినుంచి నెలసరి అద్దె వసూలు చేసినా ఆలయ నిర్వహణకు కొరత ఉండదని అంటున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం

ఆరిమేనిపాడులోని దేవదాయశాఖ భూముల ఆక్రమణ విషయం ఇటీవలే నాదృష్టికి వచ్చింది. భూములు దేవదాయ శాఖలో చేరిన ఉన్నట్లు గ్రామస్తులు చూపుతున్న ఉత్తర్వులు 20 ఏళ్ల కిందటివి. దీనిపై పూర్తిస్థాయిలో విచారించాల్సిన అవసరం ఉంది. తిరుపతిలోని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- ఆలయ ఈవో నవీన్‌కుమార్

7.77 లక్షల ఎకరాలకు సాగునీరు

- సాగునీటి సలహా మండలి సమావేశంలో తీర్మానం
- నీటి విడుదల కొనసాగించాలని నిర్ణయం
- రెండేళ్ల తర్వాత పూర్తి ఆయకట్టుకు సాగునీరు

నెల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల తర్వాత ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పూర్తి ఆయకట్టు సాగు చేసేందుకు అవకాశం కలిగింది. ఈ ఏడాది సోమశిల, కండలేరు జలాశయాల కింద 7.77 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సాగునీటి సలహా మండలి (ఐఏబీ) తీర్మానించింది. ఇందులో సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలు ఉండగా, కండలేరు కింద 2.26 లక్షల ఎకరాలు సాగుకానుంది. ఐఏబీ చైర్మన్, కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఐఏబీ సమావేశం జరిగింది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో పాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కావ్య కృష్ణారెడ్డి, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఇరిగేషన్ అధికారులు రెండు ప్రాజెక్టుల్లోని నీటి లభ్యత, ఆయకట్టు వివరాలు, సాగునీటి ప్రతిపాదనలను మండలి ముందుంచారు. దీనిపై చర్చించిన సభ్యులు రబీ సాగుకు సంబంధించి నీటి కేటాయింపులపై కీలక తీర్మానం చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఇప్పటికే రెండు జలాశయాల నుంచి నీటి విడుదల జరుగుతుండగా, సాగు పూర్తయ్యే వరకు కొనసాగించాలని నిర్ణయించారు.

● సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలు

సోమశిల ప్రాజెక్టులో ప్రస్తుతం 69.34 టీఎంసీలు నీరుంది. రానున్న రెండు నెలల్లో మరో 11 టీఎంసీలు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేశారు. మొత్తంగా 80.48 టీఎంసీలు అందుబాటులో ఉంటుందని భావించి ఆ మేరకు కేటాయింపులు జరిపారు. డెడ్ స్టోరేజీ 7.70 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 3 టీఎంసీలు, నీటి ఆవిరి 1.50 టీఎంసీలు పోను సోమశిలలో 68.46 టీఎంసీల నీరు మిగులుతుంది. అలానే కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లలో 3.17 టీఎంసీలు ఉంది. మొత్తంగా ఈ ఏడాది సాగుకు 71.63 టీఎంసీలు అందుబాటులో ఉంటుందని అధికారులు లెక్కలు వేశారు. దీని ద్వారా 5.51లక్షల ఎకరాలకు 55.10 టీఎంసీలు కేటాయించాలని ఐఏబీలో తీర్మానించారు. అందులో పెన్నార్ డెల్టాలో 2.47 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేలు, కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలు, ఉత్తర కాలువ కింద 72 వేలు, దక్షిణ కాలువ కింద 42 వేల ఎకరాలకు నీటి కేటాయింపులు జరిపారు. 10 వేల ఎకరాలకు ఒక టీఎంసీ నీటిని వినియోగించేలా నిర్ణయించారు. ఇక రాళ్లపాడుకు మరో 1.50 టీఎంసీలు పోను నికరంగా 15 టీఎంసీలు మిగులుతుందని అంచనా వేశారు. ఈ నీటిని రెండో పంటకు వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడింది.

● కండలేరు కింద..

కండలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 49.38 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. రానున్న రెండు నెలల్లో మరో 10.6 టీఎంసీలు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేశారు. మొత్తంగా 60 టీఎంసీలు ప్రాజెక్టులో ఉంటుందని, అందులో 8.40 టీఎంసీలు డెడ్ స్టోరేజీ పోను నికరంగా 51.56 టీఎంసీలు మిగులుతుందని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఇందులో చెన్నై తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు, నెల్లూరు, తిరుపతి జిల్లాల తాగునీటి అవసరాలకు 2 టీఎంసీలు, నీటి ఆవిరి 6 టీఎంసీలు, స్వర్ణముఖి బ్యారేజీ నీటి అవసరాలకు 2 టీఎంసీలు, పరిశ్రమలకు 1.25 టీఎంసీలను, లోయర్ రైపేరియన్ కింద 2.150 టీఎంసీలను కేటాయించారు. అలానే 22.60 టీఎంసీలను నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 22.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఐఏబీలో తీర్మానించారు. ఈ కేటాయింపులు అన్నీ పోగా మరో 10 టీఎంసీలు కండలేరులో మిగులుతోంది. ఈ నీటిని 2025 సంవత్సరంలో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని నిర్ణయించారు.

వైసీపీ పట్టణాధ్యక్షుడికి షోకాజ్ నోటీసు

తడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) సూళ్లూరుపేట వైసీపీలో నెలకొన్న వర్గ విభేదాలపై అధిష్ఠానం కన్నెర్ర చేసింది. ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ అధిష్ఠానం షోకాజ్ నోటీసు జారీ చేసింది. గత ఎన్నికల ముందు వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఎన్నికల సమయంలో వర్గ విభేదాలు వీధికెక్కాయి. నామినేషన్ల సయమంలో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయి బాహాబాహికి దిగిన ఘటనలు ఉన్నాయి. అప్పటి నుంచి కిలివేటి వ్యతిరేక వర్గం, టీడీపీ నేతలతో సఖ్యతగా మెలుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగానే చెంగాళమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి వైసీపీకి రాజీనామా చేయడం, తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరుతున్నామంటూ ప్రకటించడం జరిగింది. ఇదిలా ఉండగా వైసీపీ పట్టణాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి టీడీపీ నేతలతో సఖ్యతగా ఉంటూనే పార్టీలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తాడేపల్లిలో వైసీపీ అధినేత జగన్‌ను మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కలిసి శేఖర్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. స్పందించిన అధిష్ఠానం షోకాజ్ నోటీసు జారీ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడంపై వారం రోజులలోగా వివరణ ఇవ్వాల్సిందిగా ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలందించేందుకు కృషి



పనబాక లక్ష్మిని సత్కరిస్తున్న టీటీడీ అధికారులు

గూడూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలందించేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర మాజీ మంత్రి, టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి చెప్పారు. శుక్రవారం తిరుమలలో టీటీడీ పాలక మండలి సభ్యురాలుగా పనబాక లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అధికారులు పనబాక దంపతులను సత్కరించారు. అనంతరం పనబాక లక్ష్మి మాట్లాడుతూ శ్రీవారికి సేవ చేసే భాగ్యం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ పవిత్రను, హిందూ ధర్మాన్ని కాపాడేందుకు కృషి చేస్తానని అన్నారు.

అభినందనలు వెల్లువ

సూళ్లూరుపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీడీ బోర్డు సభ్యురాలిగా శుక్రవారం తిరుమలలో ప్రమాణ స్వీకారం చేసిన పనబాక లక్ష్మిని పలువురు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆమె ప్రమాణ స్వీకారానికి సూళ్లూరుపేట నుంచి అభిమానులు తరలివెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం తిరుమలలో పనబాక దంపతులను తిరుపతి పార్లమెంటు తెలుగు యువత అధికారి ప్రతినిధి నాపా మునిరాజా, చంద్ర కలిసి అభినందనలు తెలిపారు.

అక్కంపేట పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

తడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్కంపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మల్లికార్జున శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాల నాణ్యతను పరిశీలించారు. అపార్ స్టేటస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

తడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం మాంబట్టు సెజ్‌లోని ఇంక్లికాం ఇండియా పరిశ్రమలో ఉద్యోగులకు అవగాహన సదస్సు జరిగింది. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ అనుమానాస్పద ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు చెప్పరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కొండపనాయుడు, పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు

గూడూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు చేపడుతామని ఏఎంవీఐ శాంతి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్లు ధరించడంతో పాటు సరైన ధృవీకరణ పత్రాలు ఉంచుకోవాలన్నారు. అధిక వేగంతో వాహనాలను నడిపినా, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో రైతులకు మెరుగైన సేవలందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగర్జున సాగర్

వెంకటగిరి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్యంతో రైతులకు రైతులకు మెరుగైన సేవలందించాలని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా మారుతున్న నూతన సాగు పద్ధతులు ఎప్పటికప్పుడు తెలుసుకుని రైతుల అభివృద్ధికి సలహాలు ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య మాట్లాడుతూ రబీ వరిలో చేపట్టవలసిన ఎరువులు, నీటి యాజమాన్యం గురించి వివరించారు. సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు నేల సారాన్ని కాపాడుతాయన్నారు.

అంకమ్మ ఆలయంలో సహస్రదీపాలంకరణ

కోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోట పట్టణం శ్యామసుందరపురంలోని గ్రామదేవత అంకమ్మ ఆలయంలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధానార్చకుడు సునీల్‌స్వామి ఆధ్వర్యంలో మహిళలు దీపాలు వెలిగించారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ధ్వజస్థంభం స్థాపన కార్యక్రమంలో భక్తులు

గూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీ లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వేకువజామున స్వామివారిని మేల్కొలిపారు. ఆలయ శుద్ధి, అభిషేకం, యంత్ర శిఖర, బింబ ప్రతిష్ఠ, యాగశాల ప్రధాన కలశ పూజలు, ప్రతిష్ఠ హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాకుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆటోను ఢీకొని మోటరు సైక్లిస్టు మృతి

చిల్లకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదనం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటరు సైక్లిస్టు మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు... ఓజిలి మండలం పెద్దపరియా గ్రామానికి చెందిన వెంకటరమణ(48) గూడూరు వైపు మోటరు సైకిల్‌పై వెళ్తుండగా బూదనం సమీపంలో అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొన్నాడు. ఈప్రమాదంలో వెంకటరమణ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెళ్లకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి సమీపంలో 71వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.... నెల్లూరుకు చెందిన పాలిచెర్ల సౌందర్యకు కాలు విరగడంతో చిత్తూరు జిల్లా విరుపాక్షపురంలో శస్త్ర చికిత్స చేయించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. పెన్నేపల్లి వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి అదే లారీ వెనుక భాగంలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ హేమంత్‌తో పాటు సాత్విక్, సౌందర్య గాయపడ్డారు. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఎస్‌ఐ నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పట్ల అవగాహన పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ అన్నారు. శుక్రవారం కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టే దిశగా ఎదగాలన్నారు. కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదపడుతాయన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను తిలకించారు. ప్రిన్సిపాల్ రవిప్రసాద్, విశ్వక్సేనారెడ్డి, నీరజ, కొండారెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.